
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి



ఖమ్మం 3

ఉష్ణోగ్రత ఖమ్మం : గరిష్ఠం 35 । కనిష్ఠం 25 భద్రాద్రి కొత్తగూడెం : గరిష్ఠం 36 । కనిష్ఠం 27

మంగళవారం, 20 ఫిబ్రవరి 2024



ప్రభుత్వ స్థలాలకు ఫెన్సింగ్ వేసిన దృశ్యం

విచారణతోనే సరా?

- ఖమ్మంలో ప్రభుత్వ స్థలాల 'క్రమబద్ధీకరణ' వ్యవహారంలో అలసత్వం
- డాక్యుమెంట్లలో ఉన్న ఇంటినెంబర్లు రికార్డుల్లో కనుమరుగు
- విచారణ పూర్తయినా చర్యలకు ఉపక్రమించనివైనం
- రెండు డాక్యుమెంట్లు మినహా మిగిలిన వాటిపై చర్యలేవీ ?
- అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు కరువు

ఖమ్మం నగర పరిధిలో వెలుగుచూసిన ఇళ్ల నిర్మాణ క్రమబద్ధీకరణ వివాదంలో అధికారులు దాగుడుమూతలు ఆడుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. దర్జాగా కబ్జాలకు పాల్పడిన కొందరు వ్యక్తులు జీవో-59 అసరాగా చేసుకుని తప్పుడు పత్రాలతో ప్రభుత్వ స్థలాలను అధికారికంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న విషయం విదితమే. ఈ బాగోతాన్ని ఆంధ్రజ్యోతి వెలికితీయడంతో ఇప్పటివరకు రెండు డాక్యుమెంట్లను రద్దు చేయడంతోపాటు, ఓ మహిళా కార్పొరేటర్‌పై కేసు నమోదు చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా మిగిలిన స్థలాల క్రమబద్ధీకరణ సంగతి ఏమిటన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఆయా అక్రమబద్ధీకరణల వ్యవహారానికి సంబంధించి విచారణ పూర్తయినట్టు ప్రచారం జరుగుతుండగా, అసలు ఎన్ని డాక్యుమెంట్లకు అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేశారనే విషయం మాత్రం బయటకు తెలియడం లేదు.

ఖమ్మం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆక్రమిత ప్రభుత్వ స్థలాలు క్రమబద్ధీకరించాలంటే ఆక్రమణలో ఉన్న వ్యక్తుల గుర్తింపు కార్డులతోపాటుగా, వారు పొజిషన్‌లో ఉంటున్నట్టుగా ఏదైనా రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్, ఇంటిపన్ను రశీదు, విద్యుత్ బిల్లు, నీటిపన్ను వంటి పత్రాలు చూపించాల్సి ఉంటుంది. వాటిలో స్థలం తమ ఆధీనంలోనే ఉందని చెప్పడానికి ప్రధాన ఆధారంగా కనిపించేది ఇంటి పన్ను మాత్రమే. అయితే జిల్లాలో జీవో-59 ప్రకారం సుమారు 180 డాక్యుమెంట్ల వరకు రిజిస్ట్రేషన్లు జరిగినట్టు తెలుస్తుండగా వాటిల్లో సుమారు 40కి పైగా డాక్యుమెంట్లలో ఉన్న ఇంటినెంబర్లకు పొంతన లేకుండా పోవడం గమనార్హం.

చాలావరకు డాక్యుమెంట్లలో ఉన్న ఇంటి నెంబర్లు సంబంధిత మున్సిపల్ శాఖ రికార్డులో మరొకరి పేరు మీద ఉండటం, మరికొన్ని ఇంటినెంబర్లు అసలు రికార్డుల్లో లేవని చూపించడం గమనార్హం. మరికొన్ని డాక్యుమెంట్లలో అయితే స్థలం రిజిస్ట్రేషన్ పురుషుడి పేరు మీద ఉంటే ఆ ఇంటి నెంబరు మాత్రం వేరేప్రాంతంలో మహిళ పేరుమీద ఉంది. అయితే ప్రస్తుతం ఆయా డాక్యుమెంట్లలో ఉన్న ఇంటినెంబర్లకు సంబంధించి అక్రమాలు ఎక్కడ జరిగాయన్న విషయంపై చర్చ జరుగుతోంది. అక్రమాలకు సంబంధించిన ఓ డాక్యుమెంటులో ఒకే ఇంటి నెంబర్‌ను ఇద్దరికి కేటాయించి, ఆ తర్వాత తొలగించినట్టు రిపోర్టు ఇచ్చినట్టు తెలిసింది. అయితే అసలు ఆ ఇల్లు ప్రభుత్వ స్థలంలో నిర్మాణంలో ఉండగానే ఇంటినెంబర్ ఎలా కేటాయించారన్నది ప్రశ్నార్థకంగా మారింది.

ఉన్నతాధికారుల తప్పుదోవ

అ'క్రమబద్ధీకరణ' వ్యవహారంలో కొందరు మునిసిపల్ అధికారులు, కిందిస్థాయి సిబ్బంది ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జీవో-59 ప్రకారం రెగ్యులరైజ్ చేయడంలో ఇంటి నెంబర్లు కీలకపాత్ర పోషించగా ఆయా ఇంటినెంబర్లకు సంబంధించి కార్పొరేషన్ కార్యాలయం కేంద్రంగా భారీగా దందా జరిగింది. అయితే దొంగ అసెస్‌మెంట్ల ద్వారా క్రమబద్ధీకరణలు కూడా కొనసాగాయన్న ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో తాము కేటాయించిన ఇంటి నెంబర్లు సక్రమంగానే ఉన్నాయనుకునేలా ఉన్నతాధికారులకు నివేదికలు ఇచ్చారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల వెలుగులోకి వచ్చిన ఓ డాక్యుమెంట్‌కు సంబంధించిన ఇంటి నెంబర్ కేటాయింపు వ్యవహారంలో ఇదే జరిగిందన్న వాదన వినిపిస్తోంది. సదరు డాక్యుమెంట్ పురుషుడి పేరుమీద రిజిస్ట్రేషన్ కాగా.. అసలు ఆ ప్రాంతానికి సంబంధంలేని ఇంటి నెంబర్‌పై సదరు వ్యక్తికి రిజిస్ట్రేషన్ ఎలా చేశారన్నది ప్రశ్నార్థకంగా ఉంది. అంతేకాకుండా ఆ ఇంటినెంబర్‌ను 2003లోనే నగరంలోని మరోప్రాంతమైన పార్శీబంధంలో ఓ మహిళ పేరుపై ఇచ్చినట్లు ఉంది. కానీ నివేదికలో మాత్రం 2013లో పరుషుడి పేరుపై ఇచ్చినట్లు నివేదికలో పేర్కొనడం గమనార్హం.

అయితే 2003లో కేటాయించిన ఓ ఇంటినెంబరు వేరే ప్రాంతంలో మరో వ్యక్తికి ఎలా కేటాయిస్తారనేది కూడా ప్రశ్నగానే మిగిలింది. ఇలా అనేకం ఉన్నట్లు సమాచారం. ఇటీవల ఓ కార్పొరేటర్‌కు సంబంధించిన డాక్యుమెంటును రద్దు చేయగా.. సదరు డాక్యుమెంటుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంటులో పొందుపరిచిన ఇంటి నెంబరు ఎప్పుడో కూల్చబడినట్టుగా విచారణ నివేదికలో పేర్కొన్నారు. అయితే కూల్చిన ఇంటి నెంబర్‌ను ఇంకా ఎందుకు తొలగించలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు.

అధికారులపై చర్యలేవీ ?

జీవో-59లో అక్రమాలు జరిగాయనీ ఇప్పటికే ఒకటి రెండు డాక్యుమెంట్లలో నిరూపణ కాగా, ఇంటి నెంబర్ల అసెస్‌మెంట్లు, దొంగ అసెస్‌మెంట్లపై పదుల సంఖ్యలోనే ఫిర్యాదులు ఉన్నాయి. దొంగ డాక్యుమెంట్లకు సంబంధించిన వ్యక్తులపై కేసులు నమోదు చేయిస్తుండగా అసలు ఆయా అక్రమాలకు మూలంగా కనిపించే అధికారులపై మాత్రం ఎలాంటి చర్యలకు ఉపక్రమించకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. కాగా 59 జీవోల తిరస్కరించిన దరఖాస్తులకు సంబంధించిన స్థలాలను వెనక్కి తీసుకుని రక్షణ కల్పించిన అధికారులు, తప్పుడు ధ్రువపత్రాలతో అక్రమంగా స్థలాలను రెగ్యులరైజ్ చేయించుకున్న వాటిని కూడా రద్దు చేసి, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వెలుగులోకి తెచ్చిన 'ఆంధ్రజ్యోతి'

ప్రభుత్వ స్థలాలకు దొంగ అసెస్‌మెంట్లు వేసి కాజేసే ప్రయత్నం చేసే అంశాన్ని నాడు 'ఇంటి దొంగలు' శీర్షికన ఆంధ్రజ్యోతి కథనం ప్రచురించింది. కొన్ని ఇంటి నెంబర్ల ఉదాహరణలతో సహా వివరాలను పొందుపరిచింది. ఆ తర్వాత అదే విషయానికి సంబంధించి మరికొన్ని వార్తా కథనాలను కూడా ప్రచురించింది. దాంతో కదిలిన కార్పొరేషన్ అధికారులు గతేడాది వరకు మాత్రమే అసెస్‌మెంట్లను పరిశీలించి ఎనిమిది మందిపై కేసు కూడా నమోదు చేశారు. ఆ తర్వాత దొంగ అసెస్‌మెంట్లు నిజమని తేలడంతో సంబంధిత సెక్షన్ అధికారులను మరొక సెక్షన్‌కు మార్చి చేతులు దులుపుకున్నారు. కాగా ప్రస్తుతం క్రమబద్ధీకరణలో అక్రమాలు జరిగిన అంశాల మూలాలు సైతం అక్కడే ఉన్నట్టుగా ఆధారాలతో సహా బయటపెట్టింది.



పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

వేతనాలు సరిగ్గా వస్తున్నాయా ?

- పారిశుధ్య కార్మికులతో మంత్రి తుమ్మల మాటామంతీ

ఖమ్మం కార్పొరేషన్, ఫిబ్రవరి 19: పారిశుధ్య కార్మికులతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాటామంతీ జరిపారు. ఖమ్మం నగరంలోని 5వ డివిజన్‌లో సోమవారం పర్యటించిన మంత్రి... పారిశుధ్య కార్మికులతో ముచ్చటించారు. 'కార్పొరేషన్‌లో ఎప్పటినుంచి పనిచేస్తున్నారు.. వేతనాలు సక్రమంగా అందుతాన్నాయా లేదా" అని అడిగారు. తాము సుమారు 20 ఏళ్లుగా పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్నామని కార్మికులు తెలిపారు. వేతనాల గురించి ప్రశ్నించగా తమకు నెలకు రూ.18వేల వేతనం వస్తుందని, పీఎఫ్ తదితర మినహాయింపులు పోగా, నెలకు రూ.14వేల వరకు వస్తాయని చెబుతూ, చాలీచాలని వేతనంతో జీవనం సాగించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులుగా ఏళ్ల తరబడి పనిచేస్తున్నామని, తమను పర్మినెంట్ చేసేలా చర్యలు తీసుకోవాలని కార్మికులు మంత్రికి విజ్ఞప్తి చేశారు.

పోటెత్తిన ఎర్ర బంగారం



ఖమ్మం మార్కెట్, ఫిబ్రవరి 19: ఖమ్మం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌కు ఎర్రబంగారం (మిర్చి) పోటెత్తింది. సోమవారం ఒక్క రోజే సుమారు లక్ష మిర్చి బస్తాలు అమ్మకానికి వచ్చాయి. కొత్త మిర్చి సీజన్ ప్రారంభమైనాక తొలిసారిగా పంట ఇంత భారీ మొత్తంలో రావడం ఇదే ప్రథమం. మార్కెట్‌కు మూడు రోజులు వరుసగా సెలవులు ఉండటంతో పాటు మరో రెండు రోజుల్లో మేడారం జాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులు పంటను భారీగా అమ్మకానికి తెస్తున్నారు. వారం రోజుల క్రితం రోజుకు 50 వేల బస్తాల నుంచి 75 వేల బస్తాల వరకు వస్తుండగా సోమవారం ఒక్కసారిగా లక్ష బస్తాలకు పైగా అమ్మకానికి వచ్చాయి. ఈక్రమంలో మార్కెట్ యార్డులు ఉదయం 9 గంటల వరకు పూర్తిగా నిండిపోవడంతో కొంతమంది రైతులు తమ పంటను మార్కెట్ బయట రోడ్లపై దిగుమతి చేశారు. మార్కెట్లో క్వింటాలు మిర్చి రూ. 20,850 నిర్ణయించగా నాణ్యతను బట్టి క్వింటాలు రూ. 15 వేల నుంచి రూ. 19 వేల వరకు వ్యాపారులు కొనుగోలు చేశారు. మిర్చి కొనుగోళ్లను మార్కెట్ సెక్రెటరీ ప్రవీణ్‌రెడ్డి, గ్రేడ్‌టూ సెక్రెటరీ బజారు తదితరులు సమీక్షించారు. పంట మార్కెట్ యార్డులో అధికంగా ఉండటం, కాంటాలు ఆలస్యం కావడంతో మంగళవారం సెలవు ప్రకటించారు.

భైలెల్లిన పగిడిద్దరాజు

- కాలినడకన మేడారానికి పయనం
- పగిడిద్దరాజు ప్రవేశంతో మేడారం జాతర ప్రారంభం



పగిడిద్దరాజు పడగలతో వెళ్తున్న అరెం వంశీయులు

గుండాల, ఫిబ్రవరి 19: దేశంలోనే అతిపెద్ద రెండో జాతరగా ప్రసిద్ధి చెందిన మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు గుండాల మండలం వేపలగడ్డలో అంకురార్పణ జరిగింది. వన దేవత సమ్మక్క భర్త, వేపలగడ్డలోని అరెం వంశీయుల ఇలవేల్పు పగిడిద్దరాజు మేడారం మహోత్సవానికి బయలుదేరాడు. అరెం వంశీయులు పగిడిద్దరాజుతో సోమవారం మేడారానికి పయనమయ్యారు. సమ్మక్కను వివాహం చేసుకునేందుకు వేపలగడ్డలో సోమవారం పెళ్లి కుమారుడిగా ముస్తాబైన పగిడిద్దరాజు మేడారం బాట పట్టారు. ఆయన మేడారం చేరుకుంటేనే జాతరకు బీజం పడుతుంది. ప్రతీ రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే సమ్మక్క-సారలమ్మ మేడారం జాతరకు అరెం వంశానికి చెందిన పగిడిద్దరాజును వేపలగడ్డ గ్రామానికి చెందిన అరెం వంశీయులు తీసుకెళ్లడం ఆనవాయితీ.. మేడారానికి బయలుదేరే ముందు పగిడిద్దరాజుకు వేపలగడ్డలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అనంతరం శివసత్తుల పూనకాలతో డోలీవాయిద్యాల నడుమ ఆదివాసీ సంప్రదాయాలతో పగిడిద్దరాజును గర్భగుడి నుంచి గద్దెలపై ప్రతిష్ఠించి పూజలు చేశారు. తరువాత పగిడిద్దరాజు పగడాలతో అరెం వంశీయులు కాలినడకన మేడారం పయనమయ్యారు. 70కిలో మీటర్ల కాలినడక ప్రయాణంలో వీరితో పాటు మహబూబాబాద్ జిల్లా పూనుగొండ్ల గ్రామానికి చెందిన పెనక వంశీయులు ఉన్నారు. వీరంతా నేడు జంపన్న వాగుకు చేరుకుంటారు. ఈ రోజు ఇక్కడే బస చేస్తారు. 21న పగడిద్దరాజుతో పాటు గోవిందరాజు, సారలమ్మ, సమ్మక్క దేవతల ప్రవేశంతో మేడారం మహాజాతర ప్రారంభమవుతుంది.

గిరిజనులతో కాంగ్రెస్‌ది దృఢమైన బంధం

- సంత్ సేవాలాల్ జయంతిలో మంత్రి పొంగులేటి



బంజారాలతో నృత్యంచేస్తున్న మంత్రి పొంగులేటి

కూసుమంచి, ఫిబ్రవరి 19: బంజారాలను ఎస్టీ జాబితాలో చేర్చిన ఘనత ఇందిరమ్మదేనని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. కూసుమంచిలో గిరిజన ఆరాధ్యదైవం సంత్‌సేవాలాల్ జయంతి వేడుకల్లో సోమవారం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనే గిరిజన జీవితాల్లో వెలుగులు నిండాయని పేర్కొన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందాయని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి, గిరిజనులకు మధ్య ఫెవికాల్ బంధం ఉందని ఇది ఎవరో విడగొడితే విడిపోయేది కాదన్నారు. బంజారాల మీద ఉన్న ప్రేమ అభిమానం ఆత్మీయతతోనే ఆనాడు ఇందిరమ్మ ఎస్టీ సామాజికవర్గంలో చేర్పిందన్నారు.

సామాన్యుడిగా పుట్టి అసామాన్యుడిగా ఎలా ఎదగాలో ఆచరించి చూపిన మహానుభావుడు సేవాలాల్ అనే కొనియాడారు. అందుకే సేవాలాల్ జయంతిని ప్రభుత్వం ఫిబ్రవరి 15 సెలవుదినంగా ప్రకటించి అధికారికంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో గణేష్, మండల ప్రత్యేకాధికారి శ్రీరామ్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ విజయలక్ష్మి, టీపీసీసీ సభ్యులు రాయల నాగేశ్వరరావు, బాలసాని లక్ష్మీనారాయణ, మహిళాకార్పోరేషన్ మాజీచైర్మన్ స్వర్ణకుమారి, ఎంపీపీలు బాణోతు శ్రీనివాస్, బోడ మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.



- కొత్తగూడెం మునిసిపల్ చైర్‌పర్సన్‌పై వీగిపోయిన అవిశ్వాసం
- 36 మంది కౌన్సిలర్లకు గాను సమావేశానికి వచ్చింది ఒక్కరే
- కోరమ్‌కు అవసరమైన 24 మంది లేకపోవడంతో జరగని సమావేశం
- సీతాలక్ష్మి క్యాంపులో 16 మంది కౌన్సిలర్లు
- తిరుగుబాటు చేసిన శ్రీవల్లి వెంట 18 మంది కౌన్సిలర్లు

సీతాలక్ష్మి సేఫ్!

కొత్తగూడెం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెం మునిసిపల్ చైర్‌పర్సన్ బీఆర్ఎస్ పార్టీకి చెందిన కాపు సీతాలక్ష్మిపై ఆ పార్టీకే చెందిన కొందరు కౌన్సిలర్లు ఇచ్చిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. కొత్తగూడెం మినిసిపాలిటీలో 36మంది కౌన్సిలర్లు ఉండగా అవిశ్వాస సమావేశం జరగాలంటే 24మంది రావాల్సి ఉండగా సోమవారం నిర్వహించిన సమావేశానికి కేవలం ఒకే ఒక్క స్వతంత్ర కౌన్సిలర్ మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. కోరం లేకపోవడంతో సమావేశం నిర్వహించకపోవడంతో చైర్‌పర్సన్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయిందని కొత్తగూడెం ఆర్డీవో మధు ప్రకటించారు.

అవిశ్వాస తీర్మానం కోసం సోమవారం కొత్తగూడెం మునిసిపల్ కార్యాలయంలో అధికారులు సమావేశం ఏర్పాటు చేశారు. ఉదయం 11.30గంటలకే కౌన్సిలరు సమావేశానికి హాజరుకావాల్సి ఉండగా ఎవ్వరూ రాకపోవడంతో ఆర్డీవో సమావేశాన్ని మధ్యాహ్నం 2గంటలకు వాయిదా వేశారు. అయితే మధ్యాహ్నం 2.30గంటల వరకు వేచి చూసినా స్వతంత్ర కౌన్సిలర్ మండల ఆమని మాత్రమే కార్యాలయానికి చేరుకున్నారు. ఇంకెవరూ సమావేశానికి రాకపోవడంతో ఆర్డీవో మధు కోరం లేకపోవడంతో అవిశ్వాస తీర్మానం వీగిపోయినట్లు ప్రకటించారు. చైర్‌పర్సన్ సీతాలక్ష్మిపై అవిశ్వాసం ప్రకటించిన శ్రీవల్లి వర్గానికి కావాల్సిన మెజారిటీ కౌన్సిలర్లు తమ వద్ద లేకపోవడంతో వారంతా సమావేశానికి గైర్హాజరైనట్లు తెలుస్తోంది. అవిశ్వాసం వీగిపోవడంతో చైర్‌పర్సన్ సీతాలక్ష్మి తన పదవిని నిలబెట్టుకున్నారు. అవిశ్వాస తీర్మాన నేపథ్యంలో కొత్తగూడెం మున్సిపల్ కార్యాలయం వద్ద వన్‌టౌన్ సీఐ కరుణాకర్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఒకే పార్టీలో రెండు వర్గాలు..

కొత్తగూడెం మున్సిపాలిటీలో మొత్తం 36వార్డులకు గాను 24వార్డుల్లో బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఉండగా 8వార్డుల్లో సీపీఐ, ఒక వార్డులో కాంగ్రెస్, రెండువార్డుల్లో స్వతంత్రులు విజయం సాధించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ముందు సీపీఐకి చెందిన ఐదుగురు కౌన్సిలర్లు బీఆర్ఎస్‌లో చేరడంతో బీఆర్ఎస్ బలం 29కి చేరింది. అయితే బీఆర్ఎస్‌లో ఏర్పడ్డ అంతర్గత విభేదాల కారణంగా 22మంది కౌన్సిలర్లు చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మిపై అవిశ్వాసం ప్రకటిస్తూ తీర్మానంపై సంతకాలు చేసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో అవిశ్వాస పరీక్ష అనివార్యమైంది. ఈ క్రమంలో సీతాలక్ష్మి వర్గం నాయకులు పావులు కదిపారు. తమకు అనుకూలమైన 16మంది కౌన్సిలర్లతో క్యాంపునకు తరలివెళ్లారు. చైర్‌పర్సన్ పదవిని ఆశిస్తున్న 36వ వార్డు కౌన్సిలర్ భీమా శ్రీవల్లి సైతం 18మంది కౌన్సిలర్లను క్యాంపునకు తరలించినట్లు సమాచారం.

ఇటీవల కొందరు బీఆర్ఎస్ నాయకులు, మరికొందరు మహిళా కౌనిలర్ల భర్తలు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క సమక్షంలో కాంగ్రెస్‌లో చేరడంతో అవిశ్వాస తీర్మానం ఉత్కంఠగా మారింది. తీర్మానంపై 22మంది కౌన్సిలర్లు సంతకాలు చేసినా, చైర్‌పర్సన్ సీతాలక్ష్మి వెంట 16మంది కౌన్సిలర్లు క్యాంపునకు వెళ్లడంతో సమావేశం నిర్వహించేందుకు కోరం కరువైంది. మొత్తం 36మంది కౌన్సిలర్లలో 24మంది సమావేశానికి హాజరుకావాల్సి ఉండగా, శ్రీవల్లి వర్గానికి సరైన సంఖ్యాబలం లేకపోవడంతో వారు సమావేశానికి గైర్హాజరైనట్లు సమాచారం.



సమావేశానికి వస్తున్న స్వతంత్ర కౌన్సిలర్ ఆమని



ఆశల పల్లకిలో..

- కాంగ్రెస్‌లో నామినేటెడ్ పదవుల భర్తీకి అధిష్ఠానం కసరత్తు
- గాడ్‌ఫాదర్ల ద్వారా జోరుగా ప్రయత్నాలు సాగిస్తున్న నాయకులు
- ముగ్గురు మంత్రుల నుంచి సిఫారసు లేఖలు
- తమ అనుయాయులకు పదవులు దక్కేలా వ్యూహాలు
- పదేళ్ల తర్వాత భద్రాచలం ఆలయ చైర్మన్ పదవి భర్తీకి సన్నాహాలు
- రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవులపైనే అందరి నజర్

ఖమ్మం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఒకవైపు నిరుద్యోగులకు ఉద్యోగ నియామక పత్రాల పండుగ సాగుతుంటే.. మరోవైపు కాంగ్రెస్ పార్టీలో నామినేటెడ్ పదవుల జాతర కూడా మొదలు కాబోతుంది. ఇప్పటికే రాష్ట్రంలో రెండు కార్పొరేషన్ చైర్మన్ పదవులను ప్రభుత్వం భర్తీ చేసింది. ఇక దేవాదాయ కమిటీలు, మార్కెట్ కమిటీలు, ఖాళీగా ఉన్న పలు కార్పొరేషన్ చైర్మన్లు, ఇతర పాలకవర్గాల నియామకాలకు ప్రభుత్వం కసరత్తు సాగిస్తుండడంతో ఆశావహుల్లో జోష్ కనిపిస్తోంది. ఎవరికి వారు నియోజకవర్గ ఎమ్మెల్యేల లేఖలు, మంత్రుల సిఫార్సుల కోసం తిరుగుతున్నారు.

రాబోయే శివరాత్రి పండగ సందర్భంగా ఉమ్మడి జిల్లాలో శివాలయాలకు ఉత్సవ కమిటీలు, కొన్నిచోట్ల ఆలయ అభివృద్ధి కమిటీలకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే కొన్ని ఆలయ కమిటీలకు నోటిఫికేషన్లు విడుదలయ్యాయి. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల ఆలయ కమిటీల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానించారు. దీంతో అధికార పార్టీకి చెందిన నేతలు నమూనా ప్రకారం దరఖాస్తులు చేసుకుంటున్నారు. ఆలయ ధర్మకర్తల మండలి పదవులు పొందేందుకు గ్రామ, మండల, జిల్లాస్థాయి నేతలు కూడా ఉత్సాహం చూపుతున్నారు.

జిల్లాలో రాబోయే శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ నియామకం జరగబోతుందన్న ప్రచారం సాగుతోంది. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పదేళ్లగా జిల్లాలో కీలకమైన భద్రాచలం దేవస్థానం ఆలయ అభివృద్ధి కమిటీ నియామకం జరగలేదు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోను చివరి కమిటీలు పనిచేశాయి. అయితే జిల్లాస్థాయి నేతలకు లేదా ఇతర ప్రజాప్రతినిధులకు లేదా మాజీ ప్రజాప్రతినిధులకు భద్రాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ పదవి దక్కబోతోంది. ఎక్కువశాతం మంది ఉమ్మడి జిల్లానేతలు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవులపై దృష్టి సారించి పావులు కదుపుతున్నారు.

దీంతోపాటు ఉమ్మడి జిల్లాలోని ముఖ్య ఆలయాలకు కమిటీలు ఏర్పడబోతున్నాయి. ఉమ్మడి జిల్లాలో మార్కెట్ కమిటీ పాలకవర్గాలకు సైతం నియామక కసరత్తు నడుస్తోంది. జిల్లాలో ఉన్న ఆయా మార్కెట్ కమిటీ చైర్మన్ అర్హత ఉన్న అభ్యర్థుల పేర్లుతోపాటు సభ్యుల పేర్లను ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలు సిఫార్సు చేయాలని, ఎమ్మెల్యే లేని చోట నియోజకవర్గ ఇన్‌చార్జిలకు ఆ బాధ్యత అప్పగించనున్నారు. దీంతో కొందరు ఎమ్మెల్యేలు ఇప్పటికే మార్కెట్ కమిటీ అభ్యర్థుల అర్హుల జాబితా సిద్ధం చేస్తున్నారు.

జిల్లాకు చెందిన రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల జిల్లాతోపాటు రాష్ట్రంలోని ఇతర ఎమ్మెల్యేలకు కూడా మార్కెట్ కమిటీ పాలకవర్గాలకు జాబితాలు త్వరితగతిన ఇవ్వాలని, ముందుగా ఇస్తే లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ రాకముందే ఇస్తే నియామకాలు చేపడతామని సూచించినట్టు తెలిసింది. ముందుగా కమిటీలు వేసుకోవడం ద్వారా ఈ ఐదేళ్లకాలంలో ఒక్కో మార్కెట్ కమిటీకి ముగ్గురు నేతలు చైర్మన్ పదవీ బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంటుందని, ఎమ్మెల్యేలు త్వరగా జాబితాలు ఇవ్వాలని తుమ్మల ఇప్పటికే సూచించారు. దీంతో ఎమ్మెల్యేలంతా వారి వారి పరిధిలోని మార్కెట్ కమిటీ చైర్మన్‌తోపాటు సభ్యుల పదవులకు అర్హులైన అనుయాయుల పేర్లు సిద్ధం చేస్తున్నారు.

ఇక దేవాదాయ, మార్కెట్ కమిటీలతో పాటు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవులకు ఉమ్మడి జిల్లాలో జాబితా పెద్ద ఎత్తున ఉంది. రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు వర్గీయులతోపాటు ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్‌శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ, సమాచార, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కేంద్రమాజీ మంత్రి రేణుకాచౌదరి నుంచి కూడా జాబితాలు సిద్ధమవుతున్నాయి. ఎవరికి వారు తమ అనుయాయులకు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులు దక్కేలా పైస్థాయిలో పలుకుబడి ఉపయోగిస్తున్నారు. జిల్లా నుంచి పెద్దసంఖ్యలో ఆశావహులు ఉండడంతో కార్పొరేషన్ చైర్మన్ పదవుల మధ్య పోటీ కనిపిస్తోంది. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ముందే కొంత వరకు నియామక ప్రక్రియ చేపట్టాలని చూస్తున్నారు. తద్వారా లోక్‌సభ ఎన్నికల్లో ఉత్సాహంగా పదవులు పొందిన వారు మిగిలిన పదవులకు ఆశపడుతున్న వారు పోటాపోటీగా పనిచేస్తారని రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం భావిస్తోంది.



సల్లంగ చూడండి తల్లులారా..

5

- తోగ్గూడెం, కరకగూడెం, గరీభ్‌పేటల్లో వనదేవతల జాతర
- నేటి నుంచి 24వ తేదీ వరకు నిర్వహణ
- బుధవారం సారలమ్మ, గురువారం సమ్మక్క గద్దెల మీదికి

జయశంకర్ వర్సిటీ వీసీ పదవికి గట్టి పోటీ!

» 28 మంది దరఖాస్తు.. వడపోత తర్వాత ఎంపిక

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆచార్య జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్స్‌లర్ పదవికి గట్టి పోటీ నెలకొంది. ఏకంగా 28 మంది దరఖాస్తు చేసినట్లు సమాచారం. వీసీ పోస్టు కోసం ఈ నెల రెండో తేదీన రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయగా దరఖాస్తులకు సోమవారంతో గడువు ముగిసింది. 28 మంది దరఖాస్తు చేసినా... ప్రధాన పోటీ నలుగురైదుగురి మధ్యే ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వర్సిటీలో పరిశోధన విభాగం డైరెక్టర్(డీఆర్)గా పనిచేసి ఇటీవల పదవీ విరమణ చేసిన ఆర్. జగదీశ్వర్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. జగదీశ్వర్‌ది కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గి మండలం. ఐదేళ్లు డీఆర్‌గా పనిచేసిన అనుభవం ఉండటంతో వీసీ రేసులో ముందు వరుసలో ఉన్నారు. సీనియర్ ప్రొఫెసర్ ఎం.గోవర్ధన్ పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తోంది. రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు నేతృత్వంలోని స్క్రీనింగ్ కమిటీ దరఖాస్తులను పరిశీలించి.. ముగ్గురి పేర్లతో షార్ట్‌లిస్టు తయారుచేసి సీఎంకు పంపించనుంది. చివరిగా వీసీ నియామకాన్ని గవర్నర్ ఫైనల్ చేస్తారు. మొత్తం మీద వర్సిటీ వీసీ నియామకం పారదర్శకంగా నిర్వహించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

నమ్మబలికే స్కీమ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఖమ్మంక్రైం, ఫిబ్రవరి19: పెట్టుబడులు పెడితే రెట్టింపు డబ్బు ఇస్తామని నమ్మబలికే స్కీమ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ అన్నారు ప్రతి సోమవారం సీపీ కార్యాలయంలో నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమంలో పలువురు బాధితుల వద్ద నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈసందర్భంగా వచ్చిన ఫిర్యాదులనుద్దేశించి సీపీ మాట్లాడుతూ ఇన్వెస్ట్‌మెంట్ స్కీంల పేరుతో లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టిన దివ్యాంగులను మోసం చేశారని, పలువురు ఫిర్యాదు చేయడంతో వారి ఫిర్యాదు మేరకు చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించినట్లు తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

మణుగూరు, ఫిబ్రవరి19: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని సమితిసింగారంలో జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సమితిసింగారానికి చెందిన వేల్పుల వినయ్‌కుమార్(39) కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సతీష్‌కుమార్ తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

గ్రామస్థుడిని హత్య చేసిన మావోయిస్టులు

దుమ్ముగూడెం ఫిబ్రవరి 19: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతెవాడ జిల్లా మాలేవాహి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి పోలీస్ ఇన్ఫార్మర్ నెపంతో మావోయిస్టులు ఓ గ్రామస్థుడిని హత్య చేశారు. మృతదేహాన్ని చౌటియామోడ్ గ్రామ సమీపంలో పల్లి-బర్సూర్ రహదారిపై పడేశారు. తొలుత గ్రామస్థుడిని అతడి ఇంటి నుంచి ఆదివారం రాత్రి అపహరించిన మావోయిస్టులు పోలీస్ ఇన్ఫార్మర్‌గా అనుమానించి చిత్రహింసలు చేశారు. అనంతరం గొంతుకోసి హత్య చేశారు. మృతుడి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

లారీ బోల్తా.. ఇద్దరికి స్వల్ప గాయాలు

పాల్వంచ, ఫిబ్రవరి 19: జామాయిల్ లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తాపడిన సంఘటనలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఒంగోలు నుంచి సారపాకకు జామాయిల్ కర్ర లోడ్‌తో లారీ వెళ్తుండగా పాల్వంచ మండలం కేశవాపురం గ్రామంలోని జాతీయరహదారిపై అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో డ్రైవర్ గోగులపాటి వెంకట్రావు, క్లీనర్ పసుపులేటి నాగదర్గబాబులకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. కాగా ప్రమాదానికి కారణం డ్రైవర్ నిద్రమత్తులో ఉన్నట్లుగా తెలుస్తోంది.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

ఖమ్మంక్రైం, ఫిబ్రవరి19: ఆటోలో మరిచిపోయిన సెల్‌ఫోన్‌ను వెతికి కమాండ్ కంట్రోల్ సీఐ అంజలి బాధితులకు సోమవారం అప్పగించింది. వివరాల ప్రకారం.. మెడికో విద్యార్థిని అయిన సాయిప్రియ నగరంలో ఓ మెడికల్ కాలేజీలో హౌస్ సర్జన్‌గా విద్యనభ్యసిస్తుంది. ఆటోలో కళాశాల వద్దకు వెళ్లి ఆటోలో తన సెల్‌ఫోన్ మరిచి వెళ్లింది. కొద్దిసేపటి తర్వాత గుర్తించిన ఆమె ఖానాపురం హవేలి పోలీసుస్టేసన్‌లో ఫిర్యాదు చేయడంతో కమాండ్ కంట్రోల్ నుంచి సీసీ కెమెరాల ద్వారా ఆటోను గుర్తించారు. అనంతరం ఆటోడ్రైవర్ గోపీనాయక్‌ను గుర్తించి సంప్రదించగా సీటులో ఉన్న సెల్‌ఫోన్‌ను తీసుకుని సీఐకి అప్పగించాడు. అనంతరం బాధితులను పిలిచి ఆటోడ్రైవర్ చేతుల మీదుగా సీఐ బాధితులకు ఫోన్ అందించారు.

చికిత్స పొందుతూ ఇద్దరి మృతి

బూర్గంపాడు, ఫిబ్రవరి 19: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన నాగినేనిప్రోలురెడ్డి పాలెం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం...బూర్గంపాడు మండల పరిధిలోని నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామానికి చెందిన యడమకంటి శ్రీనివాసరెడ్డి(24), అదే గ్రామానికి చెందిన మిర్యాల సందీప్ కలిసి ఈ నెల 15న ద్విచక్ర వాహనంపై పాల్వంచ నుంచి బూర్గంపాడు వైపునకు వెళ్తున్నారు. ఈ క్రమంలో మోరంపల్లిబంజర గ్రామశివారులో ద్విచక్రవాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన ఇద్దరిని స్థానికులు క్షతగాత్రులను భద్రాచలం తరలించారు. పరిక్షీంచిన వైద్యులు శ్రీనివాసరెడ్డిని హైదారాబాద్ తరలించాలని సూచించినట్లు కుటుంబసభ్యులకు సూచించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదారాబాద్ నుంచి భద్రాచలం తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడు ఐటీసీ కర్మాగారంలో క్యాజువల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శ్రీనివాసరెడ్డి మృతితో రెడ్డిపాలెం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెనుబల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. పెనుబల్లి గ్రామానికి చెందిన గొల్లమందల లక్ష్మణ్‌రావు(50)శనివారం రాత్రి ద్విచక్రవాహనంపై గంగదేవిపాడు వెళ్తుండగా, గంగదేవిపాడు నుంచి వీఎంబంజర్ వస్తున్న బొలేరా వాహనం ఢీకొట్టింది. తీవ్రగాయాలైన లక్ష్మణ్‌రావు ఖమ్మం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వీఎంబంజర్ ఎస్ఐ వెంకటేష్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎలక్ట్రానిక్ షాప్‌లో చోరీ

కామేపల్లి, ఫిబ్రవరి 19: ఓ ఎలక్ట్రానిక్ షాప్‌లో తాళాలు పగలకొట్టి బీరువాలో ఉన్న రూ.10వేలు నగదును దొంగలు ఎత్తుకెళ్లిన సంఘటన కామేపల్లి మండలం పండితాపురం గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పండితాపురం ప్రధాన రహదారిపై గల జగన్ ఎలక్ట్రానిక్స్ షాపు వెనుక తలుపులను దొంగలు పగల గొట్టి బీరువాలో ఉన్న రూ.10వేలు అపహరించుకొని పోయారని బాధితుడు జగదీష్ తెలిపాడు.

మద్యం దుకాణాలపై దాడులు..?

పాల్వంచ, ఫిబ్రవరి 19 : పాల్వంచలోని మద్యం దుకాణాలపై హైదరాబాద్‌కు చెందిన ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించినట్లు తెలుస్తోంది. పాల్వంచ నటరాజ్ సెంటర్‌లోని ఓ మద్య దుకాణంలో మద్యం అధిక ధరలకు అమ్ముతున్నారని, పర్మిట్ రూమ్‌లో అధికంగా మద్యం నిల్వ చేసి బెల్టు షాపులకు తరలిస్తున్నారనే కారణాలతో ఆ దుకాణం యజమానికి రూ.5లక్షల జరిమానా విధించినట్లు సమాచారం. అదే విధంగా కరకవాగు ప్రాంతంలోని ఓ బెల్టు షాపుపై దాడి చేసి అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. అతడికి రూ.20వేలు జరిమానా విధించినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. ఈ వ్యవహారంపై సంబంధిత శాఖ అధికారులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా స్పందించలేదు.

హ్యూమన్ రైట్స్ పేరుతో తనిఖీలు


- హాస్టల్ వార్డెన్‌ను బెదిరించి రూ.లక్ష డిమాండ్
- పోలీసుల అదుపులో ముఠా సభ్యులు

కామేపల్లి, ఫిబ్రవరి 19: ఓ ఐదుగురు సభ్యులు ముఠాగా ఏర్పడి హ్యూమన్ రైట్స్ ప్రతినిధులమని చెప్పి ఏజీహెచ్ఎస్ కామేపల్లి వసతి గృహంలోకి చొరబడి హాస్టల్‌లో రిజిస్టర్లు, రికార్డులు, తరగతి గదులను, భోజనాలను పరిశీలించారు. హాస్టల్ వార్డెన్‌ను మీ హాస్టల్‌లో వసతులు సరిగ్గాలేవని, విద్యార్థులకు భోజనం సరిగా పెట్టడం లేదని చెప్పి మీపై జిల్లా అధికారులకు రిపోర్ట్ పంపిస్తామని బెదిరించారు. హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, స్టేట్ ఉమెన్స్ ప్రొటెక్షన్ అధ్యక్షురాలు జర్పుల స్రవంతినని మీ మీద రిపోర్ట్ రాస్తే మీ ఉద్యోగాలు ఊడతాయని బెదిరించింది. వాళ్ల మాటలకు భయపడిన వార్డెన్ వసంత, హెచ్‌ఎం రమేష్‌లు ఏం కావాలి మేడం అని అడగగా ఒక రూ.లక్ష ఇస్తే వెళ్లిపోతామని తెలిపారు. అయితే ఆమె నా దగ్గర రూ.లక్ష లేవని అంత ఇచ్చుకోలేనని చెప్పింది. కనీసం రూ.యాభై వేలైన చూడాలని చెప్పడంతో, రూ.50వేలు కాదని రూ.20 వేలకు ఒప్పుకున్నారు. హెచ్‌ఎం రమేష్ ద్వారా సభ్యులలో ఒకడైన భూక్య వెంకటేశ్వర్లుకు డిజిటల్ ట్రాన్‌సాక్షన్ ద్వారా రూ.20 వేలు చేశారు. స్థానికుల ద్వారా అసలు వాళ్లు హ్యూమన్ రైట్ సభ్యులా లేక ఫేక్ సభ్యుల అని తెలుసుకొని వార్డెన్ పోలీసులకు సమాచారం ఇచ్చింది. ఈ ఐదుగురు ముఠా సభ్యులైన జర్పుల స్రవంతి, భూక్య వెంకటేశ్వర్లు, మరికంటి శేఖర్, షేక్ ఫరీద్, భూక్య రెడ్యాలపై కామేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.. వార్డెన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు.

ట్రైకార్ సబ్సిడీ స్వాహా!

(మొదటిపేజీ తరువాయి)

సుమారు రూ.130 కోట్ల నిధులు కేటాయించగా.. అందులో రూ.40 కోట్లకు పైగా సబ్సిడీ నిధులు స్వాహా అయినట్లు సమాచారం. ఈ పథకం కింద.. గిరిజన సహకార ఆర్థిక సంస్థ(ట్రైకార్) ద్వారా ఒక్కొక్క యూనిట్‌కు రూ.10 లక్షల నుంచి రూ.40లక్షల దాకా ఇస్తారు. యూనిట్ ఏర్పాటుకు అయ్యే మొత్తంలో 10 శాతాన్ని.. లబ్ధిదారులు తమ వాటా ధనంగా తొలుత ఏదైనా జాతీయ బ్యాంకులో జమచేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం 60 శాతం సబ్సిడీ ఇస్తుంది. మిగిలిన 30 శాతాన్ని బ్యాంకులు రుణం రూపంలో ఇస్తాయి. రుణానికి అర్హులైన వ్యక్తులు లేదా జేఎల్ గ్రూపులు సమీప జాతీయ బ్యాంకులో ఖాతా తెరిచి, తమ వాటా 10 శాతం అందులో డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ఆ తరువాత రెండుమూడు దశల్లో బ్యాంకు.. సదరు యూనిట్‌కు సామగ్రి అందించే సంస్థల పేరు మీద మాత్రమే చెక్కులు అందించాల్సి ఉంటుంది. ప్రభుత్వ రాయితీ 60 శాతం. ఇదీ పథకం స్వరూపం. దీని కింద.. తెలంగాణలోని ములుగు జిల్లా ఏటూరునాగారం ఐటీడీఏ, భద్రాద్రికొత్తగూడెం జిల్లా భద్రాచలం ఐటీడీఏ, ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు ఐటీడీఏల ద్వారా 2020-22లో సుమారు రూ.130కోట్లకు పైగా రుణాలు మంజూరు కాగా.. రూ.62 కోట్ల సబ్సిడీ నిధులు విడుదల చేసినట్లు సమాచారం.



ములుగు జిల్లా తాడ్వాయి మండలం కొడిశాల జేఎల్ గ్రూపు చెక్‌పై ఏటురునాగారం ఐటీడీఏ పీవో సంతకం

పక్కదారి ఇలా..

నిబంధనల ప్రకారం.. బ్యాంకులు గిరిజన సంక్షేమ శాఖ నుంచి ఐటీడీఏ పీవోల ప్రత్యేక ఖాతాలకు సబ్సిడీ మొత్తాన్ని జమ చేస్తాయి. ఐటీడీఏ పీవోలు.. ఎంపికైన లబ్ధిదారుల ఖాతాకు సబ్సిడీని జమ చేయాలి. కానీ, బ్యాంకు ఇచ్చే 30శాతం రుణంతో సంబంధం లేకుండా కేవలం సబ్సిడీ డబ్బులతో యూనిట్లకు కావాల్సిన సామగ్రిని లబ్ధిదారులకు ఐటీడీఏ అధికారులే అంటగడుతున్నారు. చాలా చోట్ల పాత సామగ్రిని ఇచ్చి, లబ్ధిదారులతో సంతకాలు చేయించుకుని వెళ్తున్నారు. సరైన సామగ్రి లేక తర్వాత ఆ యూనిట్లు మూలనపడుతున్నాయి. ఉదాహరణకు.. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఏటూరునాగారం ఐటీడీఏ పరిధిలోని కొత్తగూడలో శ్రీముసలమ్మ ట్రైబల్ జేఎల్ గ్రూపునకు దాల్ మిల్ యూనిట్ కోసం రూ.40లక్షలు మంజూరయ్యాయి. స్థానిక ఇండియన్ బ్యాంకులో ఖాతా తెరిచి తమ వాటాధనం 10 శాతం (రూ.4 లక్షలు) జమ చేశారు. నిబంధనల ప్రకారం దాల్ మిల్ యంత్రాల కొనుగోలు డబ్బులను బ్యాంకు ద్వారా చెల్లించాలి. కానీ, ఆ యంత్రాలను ఓ మధ్యవర్తి ద్వారా ఐటీడీఏ అధికారులే కొనుగోలు చేసి తూతూమంత్రంగా మిల్లును ఏర్పాటు చేశారు. సుమారు రూ.8 లక్షల వరకూ ఖర్చు చేసినట్లు లెక్కలు చూపారు. ట్రయల్ రన్ పేరుతో ఆ యూనిట్‌ను మూడు రోజులు నడిపించిన సభ్యులు.. ముడి సరుకులు లేకపోవటంతో పాటు ఇంకా రావాల్సిన ఇతర యంత్రాలు లేక మిల్లును మూసేశారు. నాలుగేళ్లుగా ఆ దాల్ మిల్ నడవటం లేదు. మిగతా సబ్సిడీ సొమ్ము ఏమైందో ఎవరికీ తెలియదు. కాగా, గ్రూపు వాటాధనంగా బ్యాంకులో ఉన్న రూ.4 లక్షల్లో రూ.2.50 లక్షలు యూనిట్ కోసం ఇచ్చిన బంగ్లా మరమ్మతుల కోసమని కాంట్రాక్టర్ రంజిత్‌కు ఐటీడీఏ ఏపీవో ఆదేశాలతో ఇచ్చినట్లు గ్రూపు సభ్యులు 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. ఇప్పటి వరకు ఆ డబ్బులు తిరిగివ్వలేదు. అలాగే.. భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని పాల్వంచ మండలం ముల్కలపల్లి గ్రామానికి చెందిన గిరిజనులకు శ్రీరాయకపోడు ట్రైబల్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ ఎంఎస్ఎంఈ గ్రూపునకు కళాకృతుల తయారీ కోసం రూ.32.15 లక్షల రుణం మంజూరైంది. ఈ గ్రూపునకు సంబంధించిన 10శాతం వాటా ధనాన్ని (రూ.3.22 లక్షలు) బ్యాంకులో కాకుండా.. ఫోన్‌పే ద్వారా ఒక అధికారి తన వ్యక్తిగత ఖాతాలో జమ చేయించుకున్నారు. భద్రాచలంలోని పాత ఎన్ఆర్‌సీ భవనంలో యూనిట్ ప్రారంభానికి ఏర్పాట్లు చేశారు. అనంతరం ఐటీడీఏ అధికారులు ఈ యూనిట్ ఖాతాలో రెండు విడతల్లో రూ.5.50లక్షలు జమ చేశారు. అందులో నుంచి భవన మరమ్మతులు, సున్నం కోసమని రూ.4.50లక్షలు వాడేసుకున్నారు. ఆ కాంట్రాక్టును కూడా.. సదరు అధికారి తన దగ్గరి బంధువుకే సమర్పించేసుకున్నారు. రూ.1.50లక్షలతో కొంత సామగ్రి తీసుకొచ్చి ఆ భవనంలో ఉంచారు. ఈ యూనిట్‌కు రావాల్సిన సబ్సిడీ రూ.19.29 లక్షలు. అయితే కేవలం రూ.6 లక్షలే లెక్క చూపిస్తున్నారు. మిగతా రూ.13.29లక్షల సబ్సిడీ ఎవరి ఖాతాలోకి వెళ్లిందనేది చర్చనీయాంశంగా మారింది. బ్యాంకుతో సంబంధం లేకుండా సబ్సిడీ నిధులను వాడటం నిబంధనలకు విరుద్ధం. శాఖ అంతర్గత ఆడిట్‌లో ఈ విషయం వెలుగులోకి వచ్చినా పై అధికారుల దృష్టికి వెళ్లకుండా ఐటీడీఏ స్థాయిలోనే 'మేనేజ్' చేశారనే ప్రచారం జరుగుతోంది. ఇందులో ఎస్‌వోగా విధులు నిర్వహిస్తున్న ఓ అధికారి కీలక పాత్ర పోషించినట్లు సమాచారం. ప్రస్తుతం ఆ కళాకృతుల తయారీ కేంద్రం కళతప్పింది.

మూడో ఉదాహరణ..

మహబూబాబాద్ జిల్లా గార్లలో శ్రీసారలమ్మ జేఎల్ గ్రూపునకు సిమెంట్ ఇటుకల తయారీ కేంద్రానికి రూ.25లక్షల రుణం మంజూరైంది. గార్లలోని ఎస్‌బీఐలో ఖాతా తెరిచి తమ వాటాధనం రూ.2.50 లక్షలు జమచేశారు. ఇక్కడ బ్యాంకు లోన్ రూ.7.50 లక్షలతో సంబంధం లేకుండానే డీఆర్‌డీఏలో పని చేసే ఓ అధికారి ఐటీడీఏ అధికారులతో కలిసి యూనిట్ ప్రారంభిస్తున్నామని చెప్పి, రూ.5లక్షల సబ్సిడీని బ్యాంకు ఖాతాలో జమ చేయించారు. ఇందులో నుంచి రూ.3లక్షలు పి.శ్రీనివాస్ అనే వ్యక్తి ఖాతాకు బదిలీ అయ్యాయి. మిగతా రూ.2లక్షలు జేఎల్ గ్రూపు డ్రా చేసుకున్నట్టుగా బ్యాంకు రికార్డులున్నాయి. ఈ పథకం కింద ఖాతా తెరిచిన తరువాత యూనిట్‌కు అవసరమైన సామగ్రి కొనుగోలు చేసిన కంపెనీకే పేమెంట్లు చేయాలి. వ్యక్తిగతంగా వాడుకోవడానికి వీలులేదు. అయితే పి.శ్రీనివాస్ ఎవరు.. ఆయనకు ఎందుకు జమ చేశారనేది చర్చనీయాంశంగా మారింది. అంతేకాకుండా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కోసమని రూ.3.80లక్షలు ఎన్‌పీడీసీఎల్‌కు డీడీ రూపంలో చెల్లించారు. బ్రిక్స్ యూనిట్ కోసం ప్రత్యేకంగా ఇంత పెద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఎందుకనేది సమాధానం లేని ప్రశ్న. బయ్యారంలో కూడా సిమెంట్ ఇటుకల యూనిట్‌లో ఇలాంటి పరిస్థితే నెలకొంది. భద్రాచలం ఐటీడీఏ పరిధిలో అశ్వారావుపేట, దమ్మపేటలో కొండరెడ్లకు మంజూరైన యూనిట్లు, భద్రాచలం, దుమ్ముగూడెం మండలాల్లోని కోయలకు మంజూరైన యూనిట్లలో సబ్సిడీ వారికి తెలియకుండా గిరిజన సంక్షేమశాఖ అధికారులు స్వాహా చేసినట్టు సమాచారం. ములుగు జిల్లా తాడ్వాయి మండలం కొడిశల, లింగాల, ములుగు మండలం జంగాలపల్లి, కొత్తగూడ మండలం దొరవారి వేంపల్లి, పొగులపల్లి గ్రామాల్లోని జేఎల్ గ్రూపులకు మంజూరైన నిధులూ దారి తప్పినట్లు తెలుస్తోంది. ఇలా రాష్ట్రవ్యాప్తంగా మూడేళ్లలో రూ.40కోట్లకు పైగా సబ్సిడీ నిధులు ఐటీడీఏ, గిరిజన సంక్షేమశాఖ అధికారులు పక్కదారి పట్టించారని సమాచారం.

పీవోలకు చెక్ పవర్!

ప్రభుత్వ పథకాల కోసం ఏర్పాటు చేసుకునే లబ్ధిదారుల గ్రూపులో అధ్యక్ష, కార్యదర్శులకు చెక్‌పవర్ ఉంటుంది. ఆ ఇద్దరి పేరిటే బ్యాంకులో ఖాతా తెరుస్తారు. అయితే ఈ పథకంలో మాత్రం ఐటీడీఏ పీవోలు కూడా తమ పవర్ చూపిస్తున్నారు. ఏటూరునాగారం ఐటీడీఏ పీవో.. లబ్ధిదారులతో పాటు తనకు కూడా చెక్ పవర్ ఇవ్వాలని బ్యాంకులకు లేఖలు రాయడమే కాకుండా, చెక్కులపై సంతకాలు చేసేస్తున్నారు. దీంతో ఇతర ఐటీడీఏ పీవోలకు కూడా ఆశ పుట్టి జేఎల్ గ్రూపుల్లో తమకు కూడా జాయింట్ చెక్ పవర్ ఇవ్వాలని బ్యాంకులకు లేఖలు వ్రాసి సాధించుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రూ.2.50లక్షలు తీసుకున్నరు



మేం పెట్టిన దాల్ మిల్ నాలుగేళ్లగా మూత పడింది. బ్యాంకు నుంచి లోన్ ఇవ్వలేదు. సబ్సిడీ కూడా రాలేదు. మిషన్లు ఐటీడీఏ వాళ్లే ఇచ్చిండ్లు. మూడు రోజులు ట్రయల్ నడిపినం. ముడిసరుకు లేకపోవటంతో బంద్ జేసినం. మా వాటా కింద బ్యాంకుల జమ చేసిన రూ.5 లక్షల నుంచి కాంట్రాక్టర్ రంజిత్‌కు రూ.2.50 లక్షలు ఇచ్చినం. ఐటీడీఏ ఏపీవోతోపాటు మరో ఇద్దరు అధికారులు కాంట్రాక్టర్‌కు ఆ పైసలు ఇవ్వాలని చెప్పారు. మిల్ నడిపే రూమ్‌ను ఏడో రిపేర్ చేస్తామని తీసుకున్నారు. మళ్లీ ఇస్తామని చెప్పి నాలుగేళ్లవుతున్నా మా డబ్బులు ఇవ్వలేదు. సబ్సిడీ రావటం లేదు. దాల్ మిల్ నడవటం లేదు. మేం అన్ని రకాలుగా నష్టపోయాం.

\- భూపతి శ్యామల,
కొత్తగూడ, జేఎల్ గ్రూపు అధ్యక్షురాలు

చక్రం తిప్పింది ఆయనే!

గిరిజన సంక్షేమశాఖ ప్రధాన కార్యాలయంలోని ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగే ఈ మొత్తం దందాలో కీలక పాత్ర పోషించారని సమాచారం. ఆ 'లక్ష్మీ'పుత్రుడు తనకు తానే రాష్ట్రంలో ఈ మిషన్ మేనేజర్‌గా చెప్పుకొంటూ సబ్సిడీ నిధులను అవినీతి అధికారులకు 'ప్రసాదం'లా పంచారనే చర్చ గిరిజన శాఖలో జరుగుతోంది. శాఖలోని ప్రధాన అధికారుల నుంచి ఐటీడీఏలోని కింది స్థాయి అధికారి వరకూ అందరినీ ఆయన వాటాలతో మేనేజ్ చేస్తున్నట్టు సమాచారం. గత ప్రభుత్వ హయంలో గిరిజనశాఖ మంత్రి సమీప బంధువు కూడా ఒకరు ఈ సబ్సిడీ స్వాహాపర్వంలో కీలకంగా ఉన్నట్లుగా సమాచారం. ఈ అక్రమార్కుల భరతం పట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా విచారణ జరిపించాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు.

హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ మాజీ ఓఎస్డీ
హరికృష్ణ సస్పెన్షన్ ఉత్తర్వులు కొట్టివేత

» సస్పెన్షన్‌పై హైకోర్టుకు వెళ్లిన మాజీ ఓఎస్డీ

» కాంపిటెంట్ అథారిటీ జారీ చేయలేదంటూ సస్పెన్షన్ ఉత్తర్వుల కొట్టివేత

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సస్పెన్షన్‌కు గురైన హకీంపేట స్పోర్ట్స్ పాఠశాల మాజీ ఓఎస్డీ టి.హరికృష్ణకు హైకోర్టులో ఊరట లభించింది. కాంపిటెంట్ అథారిటీ మాత్రమే జారీ చేయాలంటూ ఆయన సస్పెన్షన్ ఉత్తర్వులను ధర్మాసనం కొట్టివేసింది. హరికృష్ణపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆయనను విధుల్లోంచి తొలగిస్తూ అప్పటి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వీసీ అండ్ ఎండీ ఉత్తర్వులు జారీ చేశారు. ఎలాంటి ఫిర్యాదు, విచారణ లేకుండా సస్పెండ్ చేయడం చెల్లదని, ఆధారాలు లేకపోయినా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంలోని యువజన వ్యవహారాలు, టూరిజం, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేశారని, ఈ ఉత్తర్వులు చెల్లవని హరికృష్ణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ పుల్ల కార్తీక్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ పశు సంవర్ధక శాఖలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌గా నియమితులయ్యారని, 2020లో హకీంపేట స్పోర్ట్స్ పాఠశాలకు ఓఎస్డీగా డిప్యూటేషన్‌పై వెళ్లారని ఆయన తరపు న్యాయవాది పేర్కొన్నారు. ఎలాంటి ఆధారాలు, కారణాలు లేకుండా, అధికార పరిధికి విరుద్ధంగా కేవలం ఆరోపణలు వచ్చాయని పేర్కొంటూ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేసినట్లు తెలిపారు. పిటిషనర్ డిప్యూటేషన్‌పై క్రీడా శాఖకు వెళ్లారని, సరైన కారణాలు, విషయ తీవ్రత ఉన్నా కాంపిటెంట్ అథారిటీ మాత్రమే సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేయగలరని వ్యాఖ్యానించింది. ఈ కేసులో పశు సంవర్ధక శాఖ ముఖ్య కార్యదర్శి అపాయింటింగ్ అథారిటీ అని.. ఇప్పటి వరకు ఎలాంటి చార్జి మెమో జారీ చేయలేదని గుర్తు చేసింది. రాష్ట్ర పశుసంవర్ధక శాఖ సర్వీస్ రూల్స్‌కు విరుద్ధంగా ఉన్నందున సదరు సస్పెన్షన్ ఉత్తర్వులను కొట్టి వేస్తున్నట్లు తుది తీర్పు జారీ చేసింది.

కుట్ర చేసి, ఇరికించి సస్పెండ్ చేశారు

» కవిత, శ్రీనివాస్ గౌడ్ స్వార్థానికి నన్ను బలి చేశారు

» మాజీ సీఎం పేషీలోని భూపాల్‌రెడ్డికి మసాజ్ చేసే వ్యక్తి కుమారుడికి సీటు ఇవ్వలేదని నాపై కుట్ర

» హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ మాజీ ఓఎస్డీ హరికృష్ణ ప్రకటన

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలోని పెద్దల ఒత్తిళ్లకు తలొగ్గలేదన్న కారణంగానే తనను కుట్రపూరితంగా ఇరికించి.. సస్పెండ్ చేశారని హకీంపేట క్రీడా పాఠశాల మాజీ ఓఎస్డీ హరికృష్ణ తెలిపారు. తనపై వచ్చిన ఆరోపణల్లో నిజానిజాలను తెలుసుకోకుండా అహంకారంతో ఎమ్మెల్సీ కవిత ట్వీట్ చేశారని, పైవారి మన్ననల కోసం మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తనను బలి చేశారని ఆరోపించారు. గత ఏడాది హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో జరిగిన ఒక ఘటనకు సంబంధించి తనపై నమోదైన కేసు విషయంలో ప్రభుత్వం విధించిన సస్పెన్షన్‌ను హైకోర్టు కొట్టివేస్తూ తీర్పు ఇచ్చిందని పేర్కొంటూ సోమవారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. సీట్ల కేటాయింపు విషయంలో గతంలో స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్‌గా ఉన్న ఆంజనేయగౌడ్, ఆయన పీఏ (రిటైర్డ్) నర్సయ్య, శాట్స్ మాజీ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి తనను ఒత్తిడికి గురి చేశారని, అప్పటి సీఎం కేసీఆర్ పేషీలోని భూపాల్‌రెడ్డికి రోజూ మసాజ్ చేసే వ్యక్తి కుమారుడికి సీటు ఇవ్వలేదన్న కారణంగా అందరూ కలిసి తనను బలి పశువును చేశారని తెలిపారు. తనను సస్పెండ్ చేసిన రోజే ఆ స్థానంలో వెలమ సామాజిక వర్గానికి చెందిన ఒక కాంట్రాక్ట్ ఉద్యోగిని నియమించారని, నిజానికి అది రాష్ట్రస్థాయి పోస్టు అని, దానిలో కాంట్రాక్ట్ ఉద్యోగిని నియమించకూడదన్న నిబంధనలు ఉన్నాయని వివరించారు. అయినా వాటిని పట్టించుకోలేదని పేర్కొన్నారు. విచారణ సమయంలో అప్పటి ప్రిన్సిపల్ సెక్రటరీ, శాట్స్ మేనేజర్‌లకు అడ్మినిస్ట్రేటివ్ స్వేచ్ఛను ఇచ్చి ఉంటే వారు సమగ్రమైన విచారణ జరిపే వారని, తద్వారా తనకు న్యాయం జరిగేదని తెలిపారు. గత ప్రభుత్వంలో పైవాళ్లు ఏది చెబితే దానినే వేదం అన్నట్టుగా వ్యవహరించేవారని ఆరోపించారు. తనపై ఆరోపణ వచ్చిన రోజు ఉదయం 9 గంటలకే ప్రెస్‌మీట్ పెట్టి మరీ తనను సస్పెండ్ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎవరిపైన అయినా ఫిర్యాదు కానీ అనుమానం కానీ వస్తే ముందు చర్యలు తీసుకుని, ఆ తరువాత విచారణ చేస్తామని గత ప్రభుత్వం చెప్పిందని, అదే సరైన విధానమైతే.. ఇప్పుడు ఎవరైనా తప్పులు చేసినట్టు ప్రభుత్వం దృష్టికి వస్తే ముందుగా చర్యలు తీసుకుని, ఆ తర్వాత విచారణ చేయించాలని సీఎం రేవంత్‌ను కోరారు. తన కుటుంబ గౌరవ మర్యాదలను నాశనం చేసిన వారందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

కాళేశ్వరం ఒప్పందాలు బయటపెట్టాలన్న పిటిషనర్‌కు హైకోర్టు అక్షింతలు

» చట్టం, ప్రజా ప్రయోజన వ్యాజ్యం రూల్స్ చదువుకొని రావాలని చురకలు

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి ఎన్ని ఒప్పందాలు జరిగాయో వాటన్నిటినీ బయటపెట్టడంతోపాటు పూర్తి వివరాలను కోర్టు ఎదుట ఉంచాలంటూ ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసిన పిటిషనర్‌పై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అసలు మీకు పిల్ రూల్స్ తెలుసా!? అని మండిపడింది. గత ఏడాది నవంబర్ 16న సికింద్రాబాద్‌కు చెందిన మధుగంటి విశ్వనాథ్‌రెడ్డి ఈ పిటిషన్ దాఖలు చేశారు. సోమవారం ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది నందిత గుహ వాదనలు వినిపించడానికి సిద్ధమవగా ధర్మాసనం జోక్యం చేసుకుంది. "పిటిషనర్‌ను సీనియర్ న్యాయవాది అని పేర్కొన్నారు. హైకోర్టు గుర్తించకుండా సీనియర్ న్యాయవాది అని ఎలా సంబోధిస్తారు? చట్టం, ప్రొసీజర్ తెలియకుండానే ఇక్కడికి వచ్చారా? ఇలాంటి పిటిషన్లు ఎందుకు వేస్తారో తెలుసు. ఆ తర్వాత ఎక్కడెక్కడ చర్చలు జరుపుతారో తెలుసు. హైకోర్టు లైబ్రరీలో కూర్చొని పిల్ రూల్స్, చట్టం చదువుకోండి. ఆ తర్వాత ఈ అంశాలపై పిల్ వేయవచ్చా? లేదా? అనేది మీకే అర్థమవుతుంది. పబ్లిక్ ఇంట్రెస్ట్ లిటిగేషన్ అంటే అంత ఆషామాషీ వ్యవహారం కాదు" అంటూ తలంటింది. పిటిషన్లో మార్పులు చేసి రావాలంటూ తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

గ్రామసభ కోరం రూల్స్ సవరణపై పిటిషన్

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గ్రామసభ నిర్వహణకు ఉండాల్సిన 'కోరం' నిబంధనలు సవరిస్తూ జారీ చేసిన జీవో 54 చెల్లదని పేర్కొంటూ ఆదేశాలు ఇవ్వాలని హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. లంబాడా హక్కుల పోరాట సమితి నాయకుడు దేవానాయక్ దీనిని దాఖలు చేశారు. గ్రామసభ నిర్వహణకు మూడో వంతు హాజరైతేనే కోరం ఉన్నట్లని, అందులో సగం ఎస్టీలు ఉండాలనే నిబంధనలను సవరించారని, ఇది పెసా చట్టంతోపాటు గిరిజన ప్రాంతాల్లోని ప్రజల హక్కులకు విరుద్ధమని పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం.. వివరణ ఇవ్వాలని ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

బీఆర్ఎస్ సెక్యులర్ పార్టీ.. బీజేపీతో పొత్తు పెట్టుకోదు: బాల్క సుమన్

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ సెక్యులర్ పార్టీ అని, తమ పార్టీ అధినేత కేసీఆర్ సెక్యులర్ నాయకుడని ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. తమ పార్టీ బీజేపీతో పొత్తు పెట్టుకునే ప్రసక్తేలేదని చెప్పారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ బీజేపీతో పొత్తు పెట్టుకుంటామని తాము ఎక్కడా చెప్పలేదని, ఎవరినీ అడగలేదన్నారు. ఆ పార్టీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఇతర నాయకులు బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకునే ప్రసక్తేలేదనడం తగదని చెప్పారు. ఈ విషయంలో బీజేపీ నాయకులు మీడియాకు లీక్ లిస్తున్నారని, పత్రికల్లో రాయిస్తున్నారని అన్నారు. 15 రోజుల్లో నలుగురు గురుకుల విద్యార్థినులు ఆత్మహత్య చేసుకున్నారని, దీన్ని పట్టించుకోకుండా రాష్ట్రంలో సమస్యలే లేనట్లు సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి చక్కర్లు కొడుతున్నారని, కాంగ్రెస్ హైకమాండ్‌కు డబ్బు సంచులు మోస్తున్నారని ఆరోపించారు.

వైటీపీపీ వద్ద ప్రజాభిప్రాయ సేకరణ నేడు

నల్లగొండ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెంలో తెలంగాణ సర్కారు నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ (వైటీపీపీ) వద్ద మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణ జరగనుంది. ఇందులో ప్రజల నుంచి సానుకూలత వస్తేనే ప్లాంట్‌కు కేంద్ర పర్యావరణ శాఖ అన్ని అనుమతులు జారీ చేస్తుందని, అప్పుడే ప్లాంట్ నుంచి అధికారికంగా విద్యుదుత్పత్తికి మార్గం సుగమమవుతుందని జెన్‌కో అధికారులు తెలిపారు. ప్లాంట్‌లో ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని, ఇళ్లు కోల్పోయిన గిరిజనులకు వెంటనే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, కొంతమందికి పరిహారాలు అందలేదని, వాటన్నింటినిపై తేల్చాలని నిలదీసేందుకు భూ నిర్వాసితులు సిద్ధమవుతున్నారు.

825 శాతం పెరిగిన ఆక్సిజన్ బెడ్స్

» దేశవ్యాప్తంగా సర్కారు ఆస్పత్రుల్లో ప్రస్తుతం 5.15 లక్షల బెడ్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): దేశంలో గడిచిన నాలుగేళ్లలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆక్సిజన్ బెడ్ల సంఖ్య 825 శాతం పెరిగినట్లు కేంద్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. దేశవ్యాప్తంగా ప్రస్తుతం 5,15,345 ఆక్సిజన్ బెడ్స్ ఉన్నట్లు తెలిపింది. అన్ని రాష్ట్రాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆక్సిజన్ పడకల వివరాలను కేంద్రం తాజాగా విడుదల చేసింది. ఈ పడకలన్నీ ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి అందుబాటులో ఉన్నట్లు తెలిపింది. 2020 ఏప్రిల్ నాటికి మన దేశంలో కేవలం 62,458 ఆక్సిజన్ బెడ్స్ ఉన్నట్లు కేంద్రం పేర్కొంది. ప్రస్తుతం దేశంలో అత్యధికంగా 1,32,314 ఆక్సిజన్ బెడ్స్ మహారాష్ట్రలో ఉన్నాయి. నాలుగేళ్ల క్రితం ఆ రాష్ట్రంలో 11,254 ఆక్సిజన్ బెడ్స్ ఉండేవి. 61,074 ఆక్సిజన్ బెడ్స్‌తో తమిళనాడు రెండో స్థానంలో ఉంది. ఆ తర్వాత స్థానాల్లో ఉత్తరప్రదేశ్(42,221), గుజరాత్(40,708), పశ్చిమబెంగాల్(28,267), కర్ణాటక(27,707) రాజస్థాన్(20,116) నిలిచాయి. తెలంగాణలో 2020ఏప్రిల్ నాటికి సర్కారీ దవాఖానాల్లో 181 ఆక్సిజన్ పడకలుండగా, ప్రస్తుతం వాటి సంఖ్య 13,664కు పెరిగినట్లు కేంద్రం పేర్కొంది. కాగా, దేశవ్యాప్తంగా ఉన్న ఆక్సిజన్ పడకల్లో 25.86 శాతం దక్షిణాది రాష్ట్రాల్లోనే ఉన్నాయి. తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ రాష్ట్రాల్లో 1,33,289 ఆక్సిజన్ బెడ్స్ ఉన్నట్లు కేంద్రం పేర్కొంది.

టీఎస్ పీఈసెట్ షెడ్యూల్ విడుదల

టీఎస్-పీఈసెట్- 2024 షెడ్యూల్‌ను శాత వాహన విశ్వవిద్యాలయం కన్వీనర్ ఆచార్య రాజేష్ కుమార్ సోమవారం విడుదల చేశారు. ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో డిగ్రీ, డిప్లమా కోర్సుల్లో ప్రవేశాలకు గాను మార్చి 14 నుంచి మే 15 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. ఆలస్యరుసుంతో మే 31 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది. జూన్ 10 నుంచి 13వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తారు.

ఖమ్మంలో చట్టవిరుద్ధంగా పోలీసుల ప్రవర్తన

» సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ప్రధాన కార్యదర్శి

ఖమ్మం, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా పోలీసులు గ్రామాల్లో చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తూ ప్రజలను భయోత్పాతానికి గురి చేస్తున్నారని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య ఆరోపించారు. తమ పార్టీ కార్యదర్శి అశోక్, కమిటీ సభ్యుడు గోపన్న, సభ్యులు ఎస్‌కే మదార్, కే సురేష్‌ను ఫిబ్రవరి 14న అదుపులోకి తీసుకున్న పోలీసులు అక్రమంగా నిర్బంధించి ఫిబ్రవరి 16న మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారని, వీరితోపాటు మరో 24 మందిపై సెక్షన్124-బి కింద కుట్ర కేసులు పెట్టారని విమర్శించారు. సీఎం జోక్యం చేసుకుని పోలీసు శాఖపై సమీక్ష చేయాలని కోరారు.

నేటినుంచి మినీ మేడారం జాతర ప్రారంభం

- తోగ్గూడెం, కరకగూడెం, గరీబ్‌పేటల్లో వనదేవతల జాతర
- నేటినుంచి 24వరకు నిర్వహణ
- బుధవారం సారలమ్మ, గురువారం సమ్మక్క గద్దెలపైకి
- భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు
- పోలీసుల బందోబస్తు

మణుగూరుటౌన్/కరకగూడెం/సుజాతనగర్ ఫిబ్రవరి 19: మణుగూరు మండలంలో మినీ మేడారంగా విరాజిల్లుతోన్న తోగ్గూడెం శ్రీ సమ్మక్క-సారాలమ్మల దేవలంలో మంగళవారం నుంచి జాతర ప్రారంభం కానుంది. ఈ మేరకు మణుగూరు ఏరియా సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో జాతర ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆలయ పరిసరాలతోపాటు సమీప అటవీ ప్రాంతంలో విద్యుదీకరణ పనులను సింగరేణి యాజమాన్యం ఏర్పాటు చేస్తోంది.

నేడు 'మండె మెలుగట'తో జాతర ప్రారంభం..

తోగ్గూడెం గ్రామంలోని మినీ మేడారం శ్రీ సమ్మక్క-సారాలమ్మ దేవాలయంలో మంగళవారం రాత్రి 11 గంటలు మండె మెలుగుట కార్యక్రమాన్ని నిర్వహించి జాతరను ప్రారంభిస్తారు. బుధవారం సారాలమ్మను సమీపంలో రథం గుట్ట పరిసర ప్రాంతం నుంచి అడవీ మార్గంలో ఆలయం వద్దకు తీసుకువచ్చి ఆలయంలో గద్దెలపైకి చేర్చుతారు. 23న అదే రథం గుట్ట నుంచి సమ్మక్క తల్లిని అటవీ మార్గంలో ఆలయం వద్దకు తీసుకు వచ్చి గద్దెపైకి చేర్చుతారు. 23న శ్రీ సమ్మక్క-సారాలమ్మలు ఇరువురు భక్తులు మొక్కులు సమర్పికునే వరకు గద్దెలపై ఆసీనులై ఉంటారు. 24న తిరిగి వనదేవతలైన సమ్మక్క-సారాలమ్మలను వనప్రవేశం చేస్తారు. దీంతో సోమవారం కూడా ఆలయ సమీపంలో జాతర ముందురోజు కూడా భక్తుల రద్దీ, సందడి ఎక్కువైంది.



స్థానిక ఆదివాసీలే వన దేవతల పూజారులు..

తొగ్గూడెం శ్రీ సమ్మక్క-సారాలమ్మల ఆలయంలో స్థానిక ఆదివాసీ గిరిజనులే పూజులుగా జాతర ఆద్యాంతం వ్యవహరిస్తారు. పర్సిక రాజమ్మ ప్రధాన పూజారిగా వ్యవహరించనుండగా.. సహాయ పూజారులుగా పర్సిక గోపమ్మ, మడకం ఇర్మయ్యలు వ్యవహిస్తారు. ఆలయ కమిటీ చైర్మన్ ఊకే వీరయ్య ఆధ్వర్యంలోని కమిటీ సభ్యులు జాతర ఏర్పాట్లను నిర్వహిస్తున్నారు. జాతరకు అధికారులను ఆహ్వానించారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ సతీష్‌కుమారల్‌ల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.

చిరుమళ్ల అడవుల్లో ..

●కరకగూడెం: మండల పరిధిలోని చిరుమళ్ళ పంచాయతీ పరిధిలోని అడవిలో కొలువు తీరిన సమ్మక్క సారలమ్మ జాతర 20 నుంచి ప్రారంభం కానుంది. చందా వారి కుటుంబీకులు ఆడపడుచులుగా కొలుస్తు ఇక్కడ సమ్మక్క సారలమ్మ జాతరను అంగరంగ వైభవంగా కళ్యాణం జరుపుతారు. మంగళవారం మండే మెలుగుతో ప్రారంభం కానున్న జాతర మహోత్సవం దేవతలకు కుంకుమ పూజలు, అభిషేకాలతో జాతరను ప్రారంభిస్తారు. బుధవారం, గురువారాల్లో దేవతలను గద్దెలపైకి చేర్చుతారు. గురువారం రాత్రి 12 గంటలకు పగిడిద్దేరాజు, సమ్మక్కకు కల్యాణం జరుపుతారు. 23 శుక్రవారం శంకు పండుగ భక్తులకు మొక్కలు చెల్లించుకుంటారు. భక్తులకు ఆలయ పూజారి చందా రామారావు (దేవరబాల) తీర్థ ప్రసాదాలు అందిస్తారు. 24 శనివారం గుడి నుంచి వన దేవత గుట్టకు తరలిస్తారు. జాతరకు వివిధ మండలాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారు.

గరీబ్‌పేట వనదేవతల మహా జాతర..

సుజాతనగర్: మినీ మేడారంగా ప్రసిద్ధి గాంచిన సుజాతనగర్ మండలంలోని రామవరం, గరీబ్‌పేట రోడ్‌లో గల అడవిలో సమ్మక్క- సారలమ్మ వనదేవతల జాతరకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు సమ్మక్క-సారలమ్మ జాతర కార్యక్రమం ఎంతో అట్టహాసంగా జరుగనుంది. జాతర సమయంలో భక్తులు అధిక సంఖ్యలో సమ్మక్క- సారలమ్మలను దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకుంటారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. సుజాతనగర్ పోలీసులతో పాటు, అటు రామవరం 2వ టౌన్ పోలీసులు బందోబస్తు ఏర్పాటును పర్యవేక్షించనున్నారు.





మణుగూరు మండలం తోగ్గూడెంలో గద్దెల వద్ద మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు, కరకగూడెం మండలం చిరుమళ్ల అడవుల్లో వనదేవతల గద్దెలు, సుజాతనగర్ మండలం గరీబ్‌పేటలో ..

పాలీసెట్ 2024 ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం ఖానాపురంహవేలి ఫిబ్రవరి 19: టీఎస్ పాలిసెట్ 2024 నోటిఫికేషన్ విడుదలైంది. 2024-25 విద్యా సంవత్సరానికి ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్, టెక్నాలజీ డిప్లొమా కోర్సులలో ప్రవేశాలకు ఉమ్మడి ప్రవేశ పరీక్ష మే 17న నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి దరఖాస్తులను ఫిబ్రవరి 15 నుంచి ఏప్రిల్ 22 వరకు ఆన్‌లైన్లో స్వీకరించనున్నారు. పరీక్ష ఫీజు ఎస్సీ, ఎస్టీలకు రూ. 250, ఇతరులకు రూ. 500 చెల్లించి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. రూ.100 ఆల స్య రుసుంతో ఏప్రిల్ 24 వరకు, రూ.300 ఆలస్య రుసుం ఏప్రిల్ 26 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని పది, తత్సమ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు, 2023-24 విద్యా సంవత్సరంలో పదోతరగతి చదివే విద్యార్థులు ఈ ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకునేందుకు అర్హులు.

తపాలా శాఖ ఆధ్వర్యంలో

'యూపీయూ లెటర్‌రైటింగ్ కాంపిటేషన్'

ఖమ్మం మామిళ్లగూడెం, ఫిబ్రవరి 19: భారత తపాలాశాఖ ఆధ్వర్యంలో యూనివర్సల్ పోస్టల్ యూనియన్ (యూపీయూ) ఇంటర్నేషనల్ లెటర్ రైటింగ్ కాంపిటీషన్‌ను నిర్వహిస్తున్నట్లు జిల్లా తపాలాశాఖ అధికారి రవికుమార్ తెలిపారు. 9 నుంచి15 ఏళ్లలోపు విద్యార్థులు పాల్గొనే ఈపోటీల్లో 150 ఏళ్లుగా యూపీఏ (యూనివర్సల్ పోస్టల్ యూనియన్) ఎనిమిది తరాలకు పైగా ప్రజలకు సేవలందించిందన్నారు. ప్రపంచాన్ని మార్చేసిన యూపీఏ భవిష్యత్ తరాల వారికి మీరు ఆశిస్తున్నది అనే అంశంపై 800 పదాలకు లోపు ఓ లేఖను రాయాల్సి ఉంటుంది. ఈనెల 29 లోగా దరఖాస్తు చేసుకుంటే వారు మార్చి 10న నిర్వహించే పరీక్షకు అర్హులుగా తేల్చనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో విజేతలకు సర్కిల్ స్థాయిలో మెదటి బహుమతిగా రూ.25వేలు, రెండో బహుమతిగా రూ.10వేలు, మూడో బహుమతిగా రూ.5వేలు అందించనున్నట్లు తెలిపారు. వీరిలో జాతీయస్థాయికి ఎంపికైన వారికి రూ.50వేలు, రెండో బహుమతిగా రూ.25వేలు, మూడో బహుమతిగా రూ.10వేలు అందజేయనున్నారు. అంతర్జాతీయ స్థాయిలో కూడా ఎంపిక చేసి వారికి గోల్డ్‌మెడల్స్ అందించనున్నట్లు విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని తపాలా ఎస్పీ రవికుమార్ తెలిపారు.

ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో రేపు జాబ్‌మేళా

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 19: నిరుద్యోగ యువతీయువకులకు జిల్లా ఉపాధికల్పన శాఖ ఆధ్వర్యంలో బుధవారం జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు ఆ శాఖ అధికారి కొండపల్లి శ్రీరామ్ తెలిపారు. జీడీఏ, ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఏఎన్ఎం, జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ అర్హత ఉన్న వారికి ఈ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోన్నట్లు చెప్పారు. అపోలో హోం, హెల్త్‌కేర్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మొత్తం హోం కేర్ నర్స్ పోస్టులను భర్తీ చేసేం దుకు 21న ప్రభుత్వ ఐటీఐ టేకులపల్లిలో జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 19 నుంచి 40 ఏళ్ల యువతీయువకులు అర్హులని తెలిపారు . రూ.9వేల నుంచి 40వేల వరకు వేతనం ఉంటుందన్నారు. ఉదయం 10గంటలకు ఇంటర్వ్యూలకు జిరాక్స్ ప్రతులతో నిరుద్యోగులు రావాలని ఆయన కోరారు.

ఖమ్మం జిల్లాకు భారీగా ఎంపీలాడ్స్ నిధులు

● ఖమ్మం, మధిర, పాలేరుకు రూ.2.10కోట్లు: ఎంపీ నామా



ఖమ్మం కార్పొరేషన్, ఫిబ్రవరి 19: ఖమ్మం జిల్లాలో అభివృద్ధిపనుల నిమిత్తం ఎంపీ ల్యాడ్స్ నిధులు భారీగా కేటాయిం చామని బీఆర్ఎస్ లోక్‌సభా పక్షనేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఖమ్మం, మధిర, పాలేరు నియోజక వర్గాలకు రూ.2కోట్ల 10లక్షల 60వేలు మంజూరు చేశామన్నారు. ఆయా నిధులతో సీసీ రహదారులు, కల్వర్టులు, స్కూళ్ల, అంగన్‌వాడీ కేంద్రాలు, హెల్త్ సబ్‌సెంటర్ల కాంపౌండ్‌వాల్ నిర్మాణాలు చేపడతామని నామా పేర్కొన్నారు. గతంలో ప్రజాప్రతినిధులు, రైతులు, ప్రజలనుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఈ నిధులు మూడు నియోజకవర్గాలకు కేటాయించామన్నారు. ఖమ్మం నియోజకవర్గంలోని రఘునాధపాలెం మండలంలో, మధిర నియోజకవర్గంలోని ముదిగొండ, బోనకల్, చింతకాని మండలాల్లో, పాలేరు నియోజకవర్గంలోని నేలకొండపల్లి, తిరుమలాయపా లెం మండలాల్లోని గ్రామాల్లో పనులు చేపట్టనున్నామన్నారు. త్వరలోనే ఆయా పనులకు శంకుస్థాపనలు చేస్తామని ఎంపీ నామా ఆ ప్రకటనలో తెలిపారు. గ్రామాల అభివృద్ధికి తన నిధులు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు.

డీసీసీబీ చైర్మన్ వెంకటేశ్వరరావుకు సన్మానం

ఖమ్మం వ్యవసాయం, ఫిబ్రవరి 19: ఉమ్మడి ఖమ్మం జిల్లా డీసీసీబీ చైర్మన్‌గా దొండపాటి వెంకటేశ్వరరావు నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సోమవారం హైదరాబాదులో రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ అధ్యక్షుడు కొండూరు రవీందర్‌రావు, మేనేజింగ్ డైరెక్టర్ నేతి మురళీధర్‌రావు, దొండపాటి వెంకటేశ్వరరావు ను పుష్పగుచ్చంతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్, హైదరాబాద్‌లో జరిగిన క్రెడిట్ పాలసీ సబ్ కమిటీ సమావే శంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరవారితో కలిసి పాల్గొన్నారు.



దొండపాటిని సన్మానిస్తున్న అపెక్స్ బ్యాంకు అధ్యక్షుడు

డ్రామా, స్పెల్ విజార్డ్ పోటీలో

పిండిప్రోలు విద్యార్థుల ప్రతిభ



రాష్ట్రస్థాయికి ఎంపికైన పిండిప్రోలు విద్యార్థులు

ఖమ్మంఖానాపురంహవేలి, ఫిబ్రవరి 19: ఇంగ్లీష్ టీచర్స్ అసోసియేషన్ నిర్వహించిన స్పెల్ విజార్డ్ పోటీల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని పాఠశాల హెచ్ఎం లక్ష్మీసుజాత తెలిపారు. సోమవారం ఖమ్మం నగరంలోని ఎస్ఎస్‌పీ పాఠశాలలో జరిగిన ఈ పోటీలలో రెండు అంశాలపై పోటీలు నిర్వహించారు. ఈ అంశాలలో విద్యార్థులు ప్రథమస్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. సీహెచ్.కృష్ణగాయత్రి స్పెల్ విజార్డ్‌లో ప్రథమ స్థానం, లోహిత్ లావణ్య జవేరియా, యామిని, కృష్ణగాయత్రి డ్రామాలో ప్రథమ బహుమతి సాధించి బహుమతులు అందుకున్నారని తెలిపారు. రాష్ట్రస్థాయిలో కూడా ప్రథమ బహుమతి గెలవాలని హెచ్ఎం విద్యార్థులకు సూచించారు.

'ఏజెన్సీలో రాజకీయాలకు స్ఫూర్తినిచ్చిన వెంకయ్య'



నివాళులర్పిస్తున్న ప్రముఖులు

భద్రాచలం, ఫిబ్రవరి 19: ఏజెన్సీ ప్రాంత రాజకీయాలకు స్ఫూర్తినిచ్చిన నాయకుడు పాటి చిన వెంకటేశ్వర్ల (వెంకయ్య)ని పలువురు వక్తలు పేర్కొన్నారు. సోమవారం భద్రాచలం సమీపంలోని ఎటపాక గ్రామంలో ఆయన ప్రథమ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఐటీసీ టీఎస్‌టీయుసీ కార్మిక సంఘం మాజీ అధ్యక్షుడు పోటు రంగారావు, టీఎన్‌జీవో జిల్లా మాజీ అధ్యక్షుడు చల్లగుండ్ల నాగేశ్వరరావు, హైకోర్టు సీనియర్ న్యాయవాది పాటి వెంకటరమణ, టీడీపీ నాయకులు ముచ్చా శ్రీనివాసరావు, ఆంధ్రజ్యోతి బ్యూరో ఇన్‌చార్జి నలజాల వెంకటరావు తదితరులు ప్రసంగిస్తూ జిల్లాలో అప్పటి ముఖ్యమంత్రులు జలగం వెంగళరావు, ఎన్టీఆర్ మంత్రులు శీలం సిద్దారెడ్డి, సంభాని చంద్రశేఖర్ ప్రస్తుత మంత్రి తుమ్మల నాగేశ్వరరావులతో ఉన్న సంబంధాన్ని, యటపాక సర్పంచ్‌గా, సొసైటీ అధ్యక్షుడిగా, ఖమ్మం డీసీసీబీ డైరెక్టరుగా, రైతు సంఘం నాయకుడిగా భద్రాచలం ప్రాంత అభివృద్ధికి కృషి జరిపారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, అభిమానులు పాల్గొన్నారు. నివాళులర్పించిన వారిలో టీడీపీ సీనియర్ నాయకుడు తాళ్లూరి పంచాంక్షరయ్య, తానా మాజీ అధ్యక్షుడు తాళ్లూరి జయశేఖర్, తాళ్లూరి రాధాకృష్ణ, సీనియర్ న్యాయవాది బలరాం చౌదరి, పాటి చిన్నవెంకటేశ్వర్ల కుమారులు చలపతిరావు, జగపతిరావు, తదితరులు ఉన్నారు.

గురుకుల విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

- ఉమ్మడి జిల్లా శిక్షణ కలెక్టర్ మయాంక్ సింగ్

భద్రాచలం, ఫిబ్రవరి 19: పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలు మార్చి ఒకటి నుంచి ప్రారంభమవుతున్నందున ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో చదివే తరగతి విద్యార్థుల పట్ల సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా శిక్షణ కలెక్టర్ మయాంక్ సింగ్ అన్నారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన గిరిజన దర్బార్లో ఐఏఎస్ శిక్షణలో భాగంగా గిరిజన దర్బారులో ఆయన పాల్గొని వివిధ సమస్యల గురించి విన్నవించడానికి వచ్చిన గిరిజనుల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరి వికాసం ద్వారా సబ్సిడీపై కరెంటు, బోరు, మోటార్లు కోసం పోడు భూముల పట్టాలు ఆన్‌లైన్ చేయించేందుకు అలాగే భూ సమస్యలు, వ్యక్తిగత సమస్యలు గిరిజన గ్రామాల్లో వ్యవసాయం చేసుకోవడానికి మోటార్లు ఇప్పించేందుకు మారుమూల ప్రాంత గిరిజన గ్రామాలకు రహదారులు, కరెంటు ఇప్పించేందుకు నూతనంగా మత్స్య సొసైటీలు ఏర్పాటు కోసం గురుకులం కళాశాల, పాఠశాలలో ఏఎన్ఎం పోస్టులు ఇప్పించేందుకు, వితంతు, ఆసరా పెన్షన్లకు అర్జీలు పెట్టుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డీడీ మణెమ్మ, ఆర్సీవో గురుకులం వెంకటేశ్వరరాజు, ఎస్వో సురేష్‌బాబు, ఏపీవో పవర్ మునీర్‌పాషా, ఏడీ అగ్రికల్చర్ భాస్కరన్, ఏసీఎంవో రమణయ్య, డీటీఆర్‌వో ఎఫ్ఆర్ మేనేజరు ఆదినారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజరు ధనలక్ష్మి, మణికుమారి పాల్గొన్నారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న శిక్షణ కలెక్టర్

సత్తుపల్లిలో రాజశ్యామల యాగం

సత్తుపల్లి పట్టణ శివారులోని శ్రీ లక్ష్మీగణపతి ఆలయంలో సోమవారం నిర్వహించిన రాజశ్యామల యాగంలో వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజలందరినీ అమ్మవారు అనుగ్రహించాలని, రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలని, సస్యశ్యామలంగా కళకళలాడాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని మంత్రి తుమ్మల కోరుకున్నారు. అంతకముందు గణపతి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తుమ్మలకు ఘనస్వాగతం పలికారు. మంత్రి వెంట సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



రాజశ్యామల యాగంలో పూజలు నిర్వహిస్తున్న తుమ్మల

సామాజిక బాధ్యతతో సేవ చేయడం వరం

● ఎల్‌వీ ప్రసాద్ ఆసుపత్రి సీనియర్ వైద్యుడు ఆదిత్యా కపూర్

పాల్వంచటౌన్, ఫిబ్రవరి19: సామాజిక బాధ్యతగా చూపులేని చిన్నారులకు, చూపు తక్కువగా ఉన్నవారికి, మెల్లకన్ను వారికి, విద్యార్థులకు సేవలు అందించడం గొప్ప వరంగా భావిస్తున్నామని ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ సీనియర్ డాక్టర్ (ఛాంపియన్) ఆదిత్యా కపూర్ అన్నారు. నవభారత్ లిమిటెడ్ కంపెనీ వారి సౌజన్యంతో పాల్వంచలో ఏర్పాటైన ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి 13 వార్షికోత్సవ వేడుకలను సోమవారం ఆసుపత్రి ప్రాంగణంలో నిర్వహించారు. నవభారత్ సీఎస్ఆర్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కృష్ణతో కలిసి జ్యోతి ప్రజ్వలనను ప్రారంభించి మాట్లాడారు. సర్వేంద్రియానాం నయనం ప్రధానం అనే సూక్తిని నమ్మి కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్న సంస్థ ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ అని చెప్పడానికి గర్వపడుతున్నానని అని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రీజినల్ అడ్మినిస్ట్రేటర్ నరేష్‌రావు, నవభారత్ వైస్ ప్రెసిడెంట్ శరత్‌బాబు, పాల్వంచ ఆసుపత్రి మాజీ అడ్మినిస్ట్రేటర్ విజయ్‌కుమార్, డాక్టర్ సారంగ్‌గుప్తా, డాక్టర్ తరుణి, డాక్టర్ శ్రేయ, డాక్టర్ శివాని, అడ్మినిస్ట్రేటర్ చందర్‌రావు, సాయితేజ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఆదిత్యా కపూర్

ఓటు హక్కుపై అవగాహన కల్పించాలి

- తుది ఓటరు జాబితా విడుదల
- వీడియోకాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి
- పాల్గొన్న ఖమ్మం, భద్రాద్రి కలెక్టర్లు గౌతమ్, ప్రియాంక

ఖమ్మం కలెక్టరేట్/కొత్తగూడెం, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి) : భారత ఎన్నికల సంఘం నిబంధనల మేర కు ఓటరు జాబితా సవరణ కార్యక్రమం- 2024లో భాగంగా తుది ఓటరు జాబితా రూపొందించి విడుదల చేసినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర అదనపు ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలు, తహసీల్దార్లతో ఓటరు జాబితా, పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ, స్వీప్ ఓటింగ్ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ కార్యక్రమం-2024లో భాగంగా ఫారం 6,7,8 ల ద్వారా అందిన దరఖాస్తులను ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా సమగ్ర విచారణ నిర్వహించి తుది ఓటర్ల జాబితాను ప్రకటించడం జరిగిందన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల తో ప్రతి వారం సమావేశాలు నిర్వహించి వారి సలహాలు, సూచనలను పరిగణలోకి తీసుకొని, మృతి చెందిన వారి వివరాలు జాబితాను తొలగించేందుకు నోటీసులు జారీ చేసి విచారణ అనంతరం తొలగించినట్లు తెలిపారు. 18 సంవత్సరముల వయస్సు నిండిన నూతన ఓటరు నమోదుకు అవకాశాన్ని కల్పించామన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో ఓటరు టర్న్ అవుట్ పెరిగే విధంగా విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. శాసనసభ నియోజకవ ర్గాల వారిగా నూతనంగా నమోదు అయిన ఓటర్ల జాబితా వివరాలను మరోసారి ధృవీకరించుకోవాలన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో అర్హత కలిగిన ప్రతి ఓటరు తమ ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఖమ్మం కలెక్టర్ గౌతమ్ మాట్లాడు తూ ఎస్.ఎస్.ఆర్-2024లో భాగంగా నూతన ఓటరు నమోదు, పేరు, చిరునామా మార్పులు, మరణిం చిన వారి వివరాలు తొలగింపుపై భారత ఎన్నికలసంఘం నిబం ధనలకు అనుగుణంగా సమగ్రమైన జాబితా రూపొం దించామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపుకలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి.మధుసూదన్‌నాయక్, ఖమ్మం, కల్లూరు ఆర్డీఓలు జి.గణేష్, అశోకచక్రవర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరీ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయనిర్మల, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాస్, మాస్టర్ ట్రైనర్లు కె.శ్రీరామ్, మదన్‌గోపాల్, కలెక్టరేట్ ఏ.ఓ అరుణ, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రాంబాబు, ఖమ్మం అర్బన్ తహసీ ల్దార్లు స్వామి తదితరులు పాల్గొన్నారు. భద్రాద్రి జిల్లాలో కలెక్టర్ ప్రియాంక, అదనపు కలెక్టర్ రాంబాబు, భద్రాచలం ఆర్డీఓ మంగీలాల్, ఇల్లెందు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కాశయ్య, కొత్తగూడెం ఆర్డీఓ మధు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ దారా ప్రసాద్, ఎలక్షన్ సిబ్బంది నవీన్, ఇల్లెందు, భద్రాచలం, మణుగూరు, కొత్తగుడెం తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఖమ్మం కలెక్టర్

విగ్రహ ప్రతిష్ఠ వాయిదా వేయండి

- శివాలయ విగ్రహ ప్రతిష్ఠపై పెద్దమ్మతల్లి ఆలయ ఈవోతో గ్రామస్థుల వాగ్వాదం




ఆలయ ప్రాంగణంలో గ్రామస్థుల వాగ్వాదం

పాల్వంచ, ఫిబ్రవరి 19: పాల్వంచ మండలం జగన్నాధపురం- కేశవాపురం గ్రామాల మధ్య ఉన్న శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) దేవస్థానంలోని రాజకీయాలు రసవత్తరంగా మారాయి. గ్రామస్థులు వర్సెస్ ఈవోగా ప్రతిభంబించాయి. గ్రామస్థుల కథనం ప్రకారం.. పెద్దమ్మతల్లి దేవస్థానం ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న శివాలయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం అధికారులు ఈ నెల 29న నిర్ణయించారు. ఈ మేరకు పాలక మండలి సభ్యులతో చర్చించి ఉన్నతాధికారులకు నివేదించారు. తేదీ నిర్ధారణ కావడంతో పనులు పూర్తి చేయడానికి ఆలయ ఈవో, పాలక మండలి కార్యాచరణ సిద్ధంచేసి ఆ దిశగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విషయం గ్రామస్థులకు తెలియడంతో సోమవారం రాత్రి ఆలయ ఈవో రజనీకుమారి ఆలయంలో ఉందని తెలుసుకుని గ్రామస్థులు పెద్దసంఖ్యలో అక్కడకు తరలి వెళ్ళారు. ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వాయిదా వేయమని పలుమార్లు విన్నవించుకున్నా ఎందుకు పరిగణలోకి తీసుకోవడంలేదని, విగ్రహాలను అమావాస్య రోజున ఎందుకు తరలించారని, చెక్కతో చేసిన ధ్వజస్తంబం వాడకుంగా రాగితో చేసిన ధ్వజస్తంభం వాడాల్సిన అవసరం ఏమిటని, పైసా ఇవ్వకుండా దాతగా పేరును ఎలా శిలాఫలకంపై పెడతారని ఈవోతో వాదనకు దిగారు. ఈ క్రమంలోనే కేశవాపురం గ్రామానికి చెందిన కొందరు విగ్రహ ప్రతిష్ఠ అనుకున్న సమయానికే చేయాలని కోరారు. దీంతో స్థానిక సీపీఐ నాయకులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలతో మాట్లాడారు. మరుసటి రోజుకు పెద్దలు వాయిదా వేయడంతో అందరూ అక్కడనుంచి వెళ్లిపోయారు.

నేడు చర్చలు: ఆలయ ఈవో రజనీ కుమారి

ఇరు గ్రామాల ప్రజలు నా వద్దకు వచ్చారు. ప్రతిష్ఠ వాయిదా వేయాలని కొందరు.. వాయిదా వేయవద్దని కొందరు కోరుతున్నారు. ఈక్రమంలోనే సాంప్రదాయాలపై పట్టున్న ఓ పండితుడి సూచనలు, సలహా ప్రకారం తుది నిర్ణయం తీసుకుందామని, మంగళవారం చర్చించుకుందామని వారికి చెప్పాను.



విధులు విస్మరిస్తే చర్యలు: డిప్యూటీ డీఎంహెచ్‌వో

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి19: వైద్యులు, సిబ్బంది సక్రమంగా పని చేయాలని, విధులు విస్మరిస్తే కఠిన చర్యలు తప్పవని డిప్యూటీ డీఎంహెచ్‌వో తలారి సీతారాం హెచ్చరించారు. సోమవారం మండలంలోని గంగారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. పీహెచ్‌సీలోని హాజరు పట్టికను పరిశీలించి, ఆయా విభాగాలను తనిఖీ చేయడంతో పాటు ఎన్‌డీడీ, పల్స్‌పోలియో కార్యక్రమాన్ని సంసిద్ధం చేయడం, కార్యాచరణ ప్రణాళిక, ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పులు పెంచే ప్రక్రియపై వైద్యుడు ఆవినాష్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ అధికారులు, సిబ్బందికి పలు సూచనలిచ్చారు.



సిబ్బందితో మాట్లాడుతున్న సీతారాం

గోడు వినండి.. పరిష్కరించండి

- ప్రజావాణిలో కలెక్టర్ గౌతమ్‌కు ఫిర్యాదుల వెల్లువ
- పరిశీలించి పరిష్కరించాలని ఆదేశం



ఫిర్యాదుదారుల సమస్యను వింటున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మంకలెక్టరేట్, ఫిబ్రవరి19: సమీకృత జిల్లా కార్యాలయాల భవనం (ఐడీఓసీ)లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వినతులు వెల్లువెత్తాయి. బాధితుల నుంచి కలెక్టర్ వీపీ గౌతమ్, అదనపు కలెక్టర్లు డి.మధుసూదన్ నాయక్, బి సత్యప్రసాద్ డీఆర్‌వో సన్యాసయ్య తదితరులు అర్జీలు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు సమస్యలపై ఏకరువు పెట్టారు. "గ్రివెన్స్‌డే" దరఖాస్తులకు ప్రాధాన్యత నిచ్చి త్వరితగతిన పరిష్కరించాలని లెక్టర్ వీపీగౌతమ్ అధికారులను ఆదేశించారు. స్వీకరించిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కారానికి ఆయా శాఖాధికారులను కలెక్టర్ ఆదేశించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి, కలెక్టరేట్ ఏవో ఎన్ అరుణ, ల్యాండ్‌సర్వే ఏడీ శ్రీనివాసులు, జిల్లా వైద్యాధికారి వి.సుబ్బారావు, డీపీవో విజయనిర్మల వివిధశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అందిన ఫిర్యాదుల్లో కొన్ని..

- కొణిజర్ల మండలం పెద్దమునగాలకు చెందిన కొదుమూరి నాగవెంకటేశ్వరరావు అనే 63ఏళ్ల వికలాంగుడు తనను భార్య పిల్లలు వదిలి వెళ్లారని, వారి పేరుతో 30 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ప్రస్తుతం నా నివాసం గృహంలోని 3.29 ఎకరాల భూమిని నా పేరుతో రిజిస్ట్రేషన్ చేయించాలంటూ కలెక్టర్ వీపీ గౌతమ్‌ను కోరాడు. సమస్యను శ్రద్దగా విన్నకలెక్టర్ పరిష్కారానికి అధికారులను ఆదేశించారు.
- ప్రజాపాలన కార్యక్రమంలో అందినదరఖాస్తులను ప్రైవేటుడేటా ఎంట్రీ ఆపరేటర్లతో జిల్లాలో గత నెలలో ఎంపీడీవో కార్యాలయాల్లో ఆన్‌లైన్ చేశామని నెల రోజులు గడుస్తున్నా మాకు ఇవ్వాల్సిన వేతనాన్ని నేటికీ చెల్లించ లేదంటూ డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఫిర్యాదు చేశారు.
- ఎర్రుపాలెం మండలం పెద్దగోపవరం రెవెన్యూ పరిధిలో కొంత మిస్సింగ్ సర్వేనెంబరును సరిచేయాలని, తిరుమలాయపాలెం మండలానికి చెందిన మిట్టకోల భద్రయ్య, పట్టాల్యాండ్ భూమిని అసైన్డ్ ల్యాండ్‌గా నమోదు అయ్యిందని తిరుమలాయపాలెం మండలం బీరోలుకు చెందిన మన్నెపల్లి అశోక్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించి ఆయా తహసీల్దార్లతో మాట్లాడి సత్వర పరిష్కారం చూపారు.
- వేంసూరు మండలం మర్లపాడుకు చెందిన గత్తం మౌనిక, దారా కృష్ణవేణి, కట్టా రాజకుమారి, దారా నాగకన్య మర్లపాడు గ్రామం, అంబేద్కర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణ సరిగాలేదని, ఎలాంటి పోషకాహారం అందించడం లేదంటూ కలెక్టర్‌కు పిర్యాదు చేశారు.
- మధిర మండలానికి చెందిన యలగందుల గోపి చంద్ తనకు బ్రెయిన్ ట్యూమర్ వల్ల కళ్లు కనిపించడం లేదని తనకు 30 శాతం సదరం సర్టిఫికేట్ ఇచ్చారని తనకు ఏలాంటి పింఛను రావడం లేదని కలెక్టర్‌ను వేడుకున్నాడు.

అర్జీలను సత్వరమే పరిష్కరించండి

నగర పాలక సంస్థ సహాయ కమిషనర్

ఖమ్మంకార్పొరేషన్: ప్రతీసోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే గ్రీవెన్స్‌లో ప్రజలు ఇచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సహాయ కమిషనర్ సంపత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలకసంస్థ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో అర్జీలను స్వీకరించారు. సంబంధిత అధికారులకు అందచేశారు. అనంతరం మాట్లాడుతూ అర్జీల పరిష్కారం విషయంలో నిర్లక్ష్యం వహించవద్దన్నారు. ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలన్నారు. గ్రీవెన్స్‌లో పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న సంపత్‌కుమార్

మంత్రి తుమ్మలకు సమస్యలపై వినతులు



యల్లంపల్లి నివాసంలో మంత్రి తుమ్మల

ఖమ్మంకార్పొరేషన్, ఫిబ్రవరి19: వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం నగరంలోని 4, 5 డివిజన్లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు వివిధ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. ఎన్నికల్లో తన గెలుపుకు సహకరించిన కాంగ్రెస్ నేతలను కలుసుకునే క్రమంలో కాంగ్రెస్ నాయకులు యల్లంపల్లి హనుమంతరావు ఇంటికి వెళ్లారు. హనుమంతరావు తల్లి యల్లంపల్లి వరమ్మ,తుమ్మలకు పుష్పగుచ్ఛం అందచేశారు. అనంతరం త్ముల వారి ఇంటిలో తేనీరు సేవించారు. నాలుగో డివిజన్ వాసులు తుమ్మలను కలుసుకొని సమస్యలపై అర్జీలు అందచేశారు. రాజీవ్‌నగర్ గుట్టపై రహదారి నిర్మాణం, తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే ఎన్నెస్పీ కాలువపై బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. మంచికంటి నగర్‌లో కరెంట్‌లైన్ షిఫ్టింగ్ చేయాలని, పారిశ్రామిక ప్రాంతంలో బఫర్‌జోన్‌ను తొలగించాలని కోరారు.

దుగ్గి అప్పిరెడ్డికి తుమ్మల నివాళి

వేంసూరు: అనారోగ్యంతో మృతిచెందిన రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకుడు దుగ్గి అప్పిరెడ్డి కుటుంబాన్ని సోమవారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరామర్శించారు. అప్పిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అప్పిరెడ్డి బీజేపీ పార్టీలో క్రియాశీలకంగా పనిచేశారని కొనియాడారు. అలాగే లచ్చన్నగూడెం గ్రామానికి చెందిన గుత్తా వెంకటేశ్వరరావును పరామర్శించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాసర చంద్రశేఖర్‌రెడ్డి, వెల్ది జగన్మోహన్‌రావు, ఎండీ.ఫైజుద్దీన్, గడిపర్తి రామారావు, కుక్కపల్లి రామకృష్ణ, రాకేష్, జమ్ముల కోటిస్వామి, మామిళ్లపల్లి వెంకటేశ్వరరావు, పుచ్చకాయల కాంతారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, సత్యనారాయణ, రాచూరి గంగరాజు, నున్నా రంగారావు పాల్గొన్నారు.

ప్రతీఒక్కరూ హెల్మెట్ ధరించాలి: జేవీఆర్ ఓసీ పీవో

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి19: ఇంటివద్ద నుంచి విధులకు హాజరయ్యే సింగరేణి ఉద్యోగులంతా హెల్మెట్ ధరించాలని జేవీఆర్ ఓసీ పీవో ఎస్.వెంకటాచారి కోరారు. సోమవారం సత్తుపల్లి పట్టణంలోని పీవీ.నరసింహారావు సెంటీనరి కాలనీ నుంచి జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీల వరకు ద్విచక్ర వాహనాలపై హెల్మెట్ ధరించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కే.దేవదాస్, డీ.సందీప్, జీ.నరసింహారావు, ఎన్.రామారావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పదోన్నతిపై పీవోకు వినతి

పదోన్నతి విషయమై జేవీఆర్ ఓసీ సెకండ్ క్లాస్ మైనింగ్ అధికారులు పీవో ఎస్.వెంకటాచారిని కలిసి వినతిపత్రం అందజేశారు. డిప్యూటీ మేనేజర్ ఈ-4కు రావాల్సిన ప్రమోషన్ ఆలస్యం అవుతున్న కారణంగా తీవ్రంగా నష్టపోతున్నామని వివరించారు. కార్యక్రమంలో పీ.నరసింహారావు, జీ.దుర్గప్రసాద్, ప్రదీప్‌కుమార్, వేమారెడ్డి, రాజేష్‌రెడ్డి, నూకరాజు, సంతోష్‌కుమార్, వేణుబాబు, దుర్గ ప్రసాద్‌రెడ్డి, కమల్‌దీప్ పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్‌కు మదర్‌థెరిస్సా విద్యార్థిని



విద్యార్థిని ఇష్రత్‌ను అభినందిస్తున్న యాజమాన్యం

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి19: మండలంలోని కొత్తూరులోని మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ సీఎస్సీ విభాగం ఫైనలీయర్ విద్యార్థిని షేక్.ఇష్రత్ ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ చలసాని హరికృష్ణ సోమవారం తెలిపారు. టెక్నోహ్యాండ్స్ ఇండియా ఐటీప్రవేట్ లిమిటెడ్ కంపనీలో నెలకు రూ. 10వేల ఇంటర్న్‌షిప్‌కు ఎంపికవ్వడం అభినందనీయమన్నారు. విద్యార్థినిని ప్రిన్సిపాల్, కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, ఛైర్మన్ కంచర్ల సత్యనారాయణ, ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ జాకీర్ హుస్సేన్,సీఎస్సీ విభాగంఅధ్యాపకులు డీ.మారేశ్వరరావు అభినందించారు.

విద్యార్థులకు రాగి గ్లాసుల పంపిణీ



గ్లాసులు పంపిణీ చేస్తున్న దృశ్యం

వైరా, ఫిబ్రవరి 19: మండలంలోని తాటిపూడి ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం తమ కుమారుడు బండి రాఘవ జన్మదినాన్ని పురస్కరించుకొని తల్లిదండ్రులు బండి గోపాలకృష్ణ, శ్రీదేవి అక్కడి విద్యార్థులకు రాగి గ్లాసులు అందజేశారు. సీఎం అల్పాహార పథకంలో భాగంగా రాగిజావ తాగటానికి అవసరమైన 60మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్‌లు బట్టా పెద్దభద్రయ్య, ఇలారపు వాసు, బండి గోపాలకృష్ణ, శ్రీదేవి, తాతా రవి, రామచంద్రరావు(బాబు), దుగ్గిరాల తాతయ్య, షేక్.మదార్, జానీపాషా, వహీద్‌పాషా, తాతా భాస్కర్‌రావు పాల్గొన్నారు.

ముదిగొండ: జడ్పీఉన్నత పాఠశాల విద్యార్థులకు పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం రాగిజావ పాత్రలను అందజేశారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ పరిశ పుల్లయ్య మాట్లాడుతూ క్రమశిక్షణతో చదువుకొని మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.శాంతి, ఉపాధ్యాయులు పద్మావతి పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ

చింతకాని,ఫిబ్రవరి19: మండల పరిధిలోని లచ్చగూడెంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో పదోతరగతి, ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్‌వో బీ కాంతకుమారి, మాజీ ఎంపీటీసీ కొప్పుల గోవిందరావు, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు టీ.క్రిష్టారెడ్డి, వీ హనుమంతరావు, ఈశ్వరరావు, విశ్వేశ్వరరావు, దుర్గాప్రసాద్, సుబ్బారావు, పాల్గొన్నారు.

సోమవరంలో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



సోమవరంలో శ్రీఅభయాంజనేయస్వామి ఆలయం, ఆలయ ధ్వజస్తంభం వద్ద భక్తులు, అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్న వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్

వైరా, ఫిబ్రవరి 19: వైరా మునిసిపాలిటీ 10,11వార్డుల పరిధిలోని సోమవరంలో సోమవారం శ్రీఅభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం కన్నుల పండుగగా జరిగింది. వేలాదిమంది భక్తులు మహోత్సవాన్ని తిలకించారు. వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ ప్రత్యేక పూజలు చేశారు. శ్రీఅభయాంజనేయస్వామి విగ్రహంతోపాటు ధ్వజస్తంభం, నాభిశిల(బొడ్రాయి), ముత్యాలమ్మతల్లి, నవగ్రహాల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఇంగువ రాజేశ్వరశర్మ సిద్ధాంతి ప్రతిష్ఠా మహోత్సవాలను జరిపించారు. అనంతరం మహాఅన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ప్రారంభించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మునిసిపల్ చైర్మన్, వార్డు కౌన్సిలర్లు సూతకాని జైపాల్, దారెల్లి పవిత్రకుమారి, కర్నాటి నందిని, బత్తుల గీత, మాదినేని సునీత పూజలు చేశారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు కట్ల రంగారావు, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతరాములు, పొదిల హరినాథ్, కట్ల సంతోష్, కర్నాటి హన్మంతరావు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు చింతనిప్పు మురళీధర్‌రావు, కొల్లి వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, దొంతెబోయిన వెంకటేశ్వర్లు, హరికృష్ణ, గొల్లపూడి హరినాథ్‌బాబు, కృష్ణారావు, కొల్లి రమేష్ తదితరులు పర్యవేక్షించారు.

వీడీవోస్ కాలనీ రామాలయ వార్షికోత్సవాలు

ఖమ్మంసాంస్కృతికం: వీడీవోస్ కాలనీ టీడీపీ ఆఫీసు పక్కనగల రామాలయ పంచమ వార్షికోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా హోమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు గుంటుపల్లి శ్రీనివాసరావు, చెరుకూరి రమేష్ బాబు, ఏపూరి మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లమడలో రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన

సత్తుపల్లి: మండలంలోని తాళ్లమడలో నిర్మించనున్న రామాలయ నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వేపూరి తిరుమలరావు, బాల బుజ్జయ్య, శాఖమూడి మధు, మండలపు సుబ్బారావు, వేంపాటి లక్ష్మీనారాయణ, నున్నా జగన్మోహనరావు, మండలపు ప్రభాకర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

విప్పలమడకలో సీసీ రోడ్లకు శంకుస్థాపన

వైరా, ఫిబ్రవరి19: మండలంలోని విప్పలమడకలో రూ.12లక్షల ఈజీఎస్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ చొరవతో నాలుగు రోడ్ల నిర్మాణానికి రూ.12లక్షలు మంజూరయ్యాయి. పంచాయతీ కార్యదర్శి వి. రామకృష్ణ, పీఆర్ ఇంజనీరింగ్ అధికారి అప్పారావు, మాజీ సర్పంచ్‌లు పారుపల్లి కృష్ణారావు, తుమ్మల జాన్‌పాపయ్య, కొలికొండ వీరభద్రరావు, మాజీ ఉపసర్పంచ్ వీరపనేని చెన్నకేశవరావు, గరికపాడు సొసైటీ డైరెక్టర్ దేవభక్తిని అర్జున్‌రావు, మాజీ నీటిసంఘం అధ్యక్షుడు కొల్లా వెంకటేశ్వరరావు, నాయకులు రుద్రాక్షల వెంకటాచారి, దేవభక్తిని సాంబశివరావు, మేడా శరాబందీ, గరిడేపల్లి సుబ్బారావు, వీరపనేని రామారావు, లక్ష్మణ్‌రావు, ఉన్నం రామారావు, మేడా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జగన్నాథపురంలో..

చింతకాని: మండల పరిధిలోని జగన్నాథపురంలో గ్రామంలో సీసీరోడ్లకు ఎంపీపీ కోపూరి పూర్ణయ్య సోమవారం శంకుస్థాపన చేశారు. రూ.7 లక్షలతో సీసీ రోడ్లు నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో రవీంద్రప్రసాద్, ప్రత్యేక అధికారి సంపత్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు, బందెల నాగార్జున, కొప్పుల గోవిందరావు, తిరుపతి అంజయ్య, అవులూరి వెంకటేశ్వర్లు, తోటకూరి అప్పారావు, మండెపూడి కిషన్‌రావు, కార్యదర్శి దామాల వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

కృష్ణాపురం గ్రామంలో..

మధిర రూరల్: మధిర మండలం కృష్ణాపురం గ్రామంలోని ఎస్సీకాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కృషితో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద మంజూరైన రూ.8 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, మాజీ సర్పంచ్ కర్నాటి రామారావు, నాయకులు పోచేపల్లి శంకర్, వేల్పుల చెంచయ్య, వంశీకృష్ణ, అద్దంకి రవికుమార్, పులిబండ్ల చిట్టిబాబు, గొల్లమందల శ్రీనివాస్, పెద్దబ్బాయి, సురేష్, కృష్ణ పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న మాజీ సర్పంచ్, నాయకులు

జిల్లా వైద్యాధికారిగా సుబ్బారావు

ఖమ్మంకలెక్టరేట్,ఫిబ్రవరి19: జిల్లాఇన్‌చార్జి వైద్యాధికారిగా వరికూటి సుబ్బారావును నియమిస్తూ కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం కలెక్టర్ వీపీ గౌతమ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు అనంతరం డీఎంహెచ్‌వో ఛాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఆయన జిల్లా క్షయనివారణ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లా వైద్యాధికారిగా పనిచేసిన డాక్టర్ బి.మాలతి వ్యక్తిగత కారణాలతో సెలవుపై వెళ్లారు. ఈనేపథ్యంలో డాక్టర్ రామునాయక్‌ను ఇన్‌చార్జి జిల్లా వైద్యాధికారిగా నియ మించారు. ఆయన గతనెల 31న బాధ్యతలు చేపట్టారు. అయితే రాము నాయక్ కూడా వ్యక్తిగత కారణాలతో తిరస్కరించారు. దీంతో డాక్టర్ సుబ్బారావును నియమించారు.

బాధ్యతలు చేపట్టిన వైరా, సత్తుపల్లి ఎంవీఐలు

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి19: రోడ్డు ప్రమాదాలు నివారించడంలో యువత పాత్ర కీలకమైనదని సత్తుపల్లి మోటారు వాహనముల తనిఖీ అధికారి యోగేశ్వర్ జాదవ్ అన్నారు. సత్తుపల్లి రవాణా శాఖ యూనిట్ కార్యాలయ ఎంవీఐగా సోమవారం ఆయన నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. కాగా మంచిర్యాల ఆయన సత్తుపల్లికి రాగా ఇక్కడ పని చేస్తున్న సంగం వెంకట పుల్లయ్య అశ్వారావుపేట చెక్‌పోస్టుకు బదిలీపై వెళ్లారు.

వైరా: వైరా మోటారువాహనాల తనిఖీ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ)గా ఏ.వరప్రసాద్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఏడుసంవత్సరాలుగా ఇక్కడ ఎంవీఐగా పనిచేసిన బాదావత్ శంకర్‌నాయక్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వచ్చిన వరప్రసాద్ బాధ్యతలు చేపట్టారు.

ట్రాఫిక్ ఏసీపీ..

ఖమ్మంక్రైం: ఖమ్మం ట్రాఫిక్ ఏసీపీగా బి.శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల బదిలీల్లో భాగంగా ఖమ్మం ట్రాఫిక్ ఏసీపీగా వచ్చారు. అనంతరం సీపీ సునిల్‌దత్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఖమ్మం రూరల్ ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన బి.తిరుపతిరెడ్డి సీపీని కలిశారు.

వైరా ఏడీఏ..

వైరా: వైరా డివిజన్ వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్(ఏడీఏ)గా మిట్టపల్లి సతీష్‌కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు వైరా ఏడీఏగా పనిచేసిన వి.బాబూరావును భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యవసాయ అధికారి(డీఏవో)గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఖమ్మం రైతుశిక్షణ కేంద్రంలో ఏడీఏగా పనిచేస్తున్న సతీష్‌కుమార్ పూర్తి అదనపు బాధ్యతలతో వైరా ఏడీఏగా బదిలీ చేశారు. ఆయన వైరా డివిజన్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు.

పీఆర్సీలో న్యాయం చేయాలి

తల్లాడ, ఫిబ్రవరి 19: అడవుల పరిరక్షణకు కృషిచేస్తున్న అటవీశాఖ ఉద్యోగులకు రాబోయే పీఆర్సీలో ఇతర యూనిఫాం ఉద్యోగులతో సమానంగా వేతనం ప్రకటించాలని అటవీశాఖ ఉద్యోగసంఘం సత్తుపల్లి డివిజన్ అధ్యక్షుడు బి.శ్రీను కోరారు. సోమవారం తల్లాడ ఫారెస్ట్ రేంజ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్త పీఆర్సీలో అటవీశాఖ ఉద్యోగుల సేవలను గుర్తించాలని, త్వరలో మంత్రులు, ఉన్నతాధికారులను కలిసి విన్నవించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు ఎం.భరత్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఎల్.రాంబాబు, కార్యదర్శులు వి.కృష్ణమూర్తి, వి.సాంబయ్య, కోశాధికారి ఎండీ.అజీమ్‌ఆలీ పాల్గొన్నారు.

ఘనంగా చత్రపతి శివాజీ జయంతి



శివాజీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

ఖమ్మంబైపాస్‌రోడ్, ఫిబ్రవరి19: చత్రపతి శివాజీ జయంతి సందర్భంగా ఖమ్మం బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ శివాజీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. వన్‌టౌన్ పెద్దలతో సంప్రదింపులు జరిపి శివాజీ విగ్రహం ఏర్పాటుకు కృషిచేస్తున్నామన్నారు

ఖమ్మంచర్చికాంపౌండ్: బీసీకులసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నగరంలోని త్రీటౌన్‌లో చత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని నిర్వహించారు. సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పిట్టల వెంకటనర్సయ్య శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేలకొండపల్లి: చత్రపతి శివాజీ మహరాజ్ 394వ జయంతి వేడుకలను సోమవారం నేలకొండపల్లిలో బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నేలకొండపల్లి పీఎస్సార్ సెంటర్లో చత్రపతి శివాజీ చిత్రపటానికి కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి పూలమాలలేసి ఘన నివాళులర్పించారు.

మధిరలో కోర్టు బిల్డింగ్‌ల నిర్మాణానికి నిధులు మంజూరు

మధిరటౌన్, ఫిబ్రవరి19: మధిరలో రెండు కోర్టు బిల్డింగ్‌ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.24కోట్లు మంజూరు చేస్తూ సోమవారం జీఓ విడుదల చేసింది. మధిరలో 1939లో నిజాం ప్రభుత్వ హాయంలో కోర్టుబిల్డింగ్ నిర్మించారు. నాటినుంచి గతసంవత్సర కాలం వరకు అక్కడే కోర్టు కార్యకలాపాలు నడుస్తున్నాయి. శిథిలావస్థకు చేరి వర్షానికి నీళ్ల కారుతుండటంతో, సంవత్సరం క్రితం పశువుల ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న బిల్డింగ్‌లోకి కోర్టును మార్చారు. ఇంతలోనే మధిరకు సబ్‌కోర్టు మంజూరు కావడంతో బిల్డింగ్ లేక ఎక్కడ ప్రారంభించాలో అధికారులకు అర్థం కాకుండా ఉంది. దీంతో డిప్యూటీ సీఎం నిధులు మంజూరు చేశారు.

మాజీ ఎంపీపీ వేదగిరికి నివాళి

వైరా, ఫిబ్రవరి 19: వైరాలో మాజీ ఎంపీపీ వేదగిరి శ్రీనివాసరావు నాల్గో వర్ధంతిని సీపీఎం కార్యాలయంలో ఆదివారం రాత్రి నిర్వహించారు. మండలంలోని గన్నవరంలో కూడా వేదగిరి వర్ధంతి సభ జరిగింది. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు రాంబాబు, పట్టణ, మండల కార్యదర్శులు సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, నాయకులు పారుపల్లి కృష్ణారావు, షేక్.జమాల్, మండడపు రామారావు, తోట కృష్ణవేణి పాల్గొన్నారు.

సీపీఐఎంఎల్ మాస్‌లైన్ పోస్టర్ ఆవిష్కరణ

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి19: సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా పోస్టర్‌ను జిల్లానాయకులు కమ్మకోమటి నాగేశ్వరావు ఆవిష్కరించారు. సోమవారం మండలంలోని పిండిప్రోలులో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఖమ్మంలో మార్చి 3న సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా ఆలిండియా ఐక్యత మహాసభలు జరుగుతాయన్నారు. 16 రాష్ట్రాల నుంచి 300మందికిపైగాప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆపార్టీ నాయకులు తిమ్మిడి హనుమంతరావు, ఎస్.వెంకటేశ్వర్లు, టి.వెంకటస్వామి యడ్లపల్లి నవీన్, ఆరెంపుల వెంకన్న, చిరంజీవి, మీగడ సత్యం, వెంకన్న, సరోజిని పాల్గొన్నారు.

తల్లాడలో ఎమ్మెల్యే రాగమయి పర్యటన

తల్లాడ, ఫిబ్రవరి 19: తల్లాడ మండలంలో సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి పర్యటించారు. తల్లాడ మండలం బిల్లుపాడు గ్రామంలో సొసైటీ మాజీ చైర్మన్ జక్కంపూడి కృష్ణమూర్తిని పరామర్శించారు. నూతనకల్ గ్రామంలో గణేశుల శ్రీనివాసరావు దశదినకర్మకు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

భట్టి చిత్రపటానికి క్షీరాభిషేకం

బోనకల్, ఫిబ్రవరి 19: మండలంలోని ఆళ్లపాడు గ్రామంలో సోమవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టీ విక్రమార్క చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం చేశారు. ఆళ్లపాడు నుంచి నారాయణపురం, కలకోట వరకు లింకు రోడ్డుకు నిధులను మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వం ఏర్పాటైన కొద్ది నెలల్లోనే లింకు రోడ్లకు నిధులు మంజూరు చేసి అభివృద్ధికి మారు పేరుగా ప్రజానేత భట్టి నిలిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ బీసీసెల్ మండల అధ్యక్షుడు కందుల పాపారావు, నాయకులు తోటకూర వెంకటేశ్వరావు, కందుల సత్యం, బుంగ రాములు, మరీదు వీరబాబు, వెంకట్రావు, అంకురాజు, ప్రసాద్, రోశయ్య, ఆనందరావు, రాంబాబు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ విధానాలపై ఉద్యమం: పోతినేని

బోనకల్, ఫిబ్రవరి 19: బీజేపీ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజాఉద్యమాలను ఉధృతం చేస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు హెచ్చరించారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఆ పార్టీ మండల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరావు, చింతలచెర్వు కోటేశ్వరావు, మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరావు, తుళ్లూరి రమేష్, గుగులోతు పంతు, జొన్నలగడ్డ సునిత, మురళీకృష్ణ, బంధం శ్రీను పాల్గొన్నారు.

కామేపల్లి పీఏసీఎస్ తాత్కాలిక చైర్మన్‌గా కాట్రాల

కామేపల్లి, ఫిబ్రవరి19: కామేపల్లి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్‌గా వైఎస్ చైర్మన్‌గా ఉన్న కాట్రాల రోశయ్య చైర్మన్‌గా బాధ్యతలు సోమవారం చేపట్టారు. చైర్మన్ తీర్దాల చిదంబరరావుపై డైరెక్టర్లు అవిశ్వాసం పెట్టారు. అయితే రెండు రోజుల క్రితం చిందబరరావు పదవికి రాజీనామా చేశారు. దీంతో జిల్లా సహకార శాఖ అధికారులు కాట్రాల రోషయ్యకు బాధ్యతలు అప్పజెప్పారు. ఈసందర్భంగా రోషయ్యను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ యాదగిరి, కాట్రాల రాంబాబు సీతఈఓ నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మధ్యాహ్న భోజన కార్యక్రమం

కల్లూరు, ఫిబ్రవరి 19: కల్లూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు 30 రోజులుగా అందిస్తున్న మధ్యాహ్నబోజన వితరణ కార్యక్రమం సోమవారంతో విజయవంతగా ముగిసింది. ఈ సందర్భంగా అదే కళాశాలలో 1977-79లో ఇంటర్ చదువుకున్న నాటి విద్యార్థుల మిత్ర బృందం ఎస్‌కె.జానిమియా, దోసపాటి భాస్కరరావు, పసుమర్తి వెంకటేశ్వరరావు, ఎస్‌కే ఇస్మాయిల్, కృష్ణయ్య పి.గుర్నాథం తదితరులు ఆర్థికంగా ఈ కార్యక్రమానికి చేయూత నిచ్చారు. ముగింపు సమావేశంలో కళాశాల అభివృద్ధి కమిటీ తరుపున పసుమర్తి చందర్‌రావు, అత్తునూరి రంగారెడ్డి, లక్కినేని కృష్ణ మాట్లాడారు. ఇంటర్‌లో ప్రథమ, ద్వితీయ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందిస్తామన్నారు.



విద్యార్థులకు భోజనం అందిస్తున్న పూర్వవిద్యార్థులు